
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

నంద్యాల
జిల్లా వార్తలు
5
బుధవారం 26 మార్చి 2025

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరి
	బుధవారం	గురువారం
కర్నూలు	6:35	4:55
నంద్యాల	6:31	4:55

21 మంది కౌన్సిలర్లు డుమ్మా

ఆత్మకూరు కౌన్సిల్ సమావేశం వాయిదా


ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం

ఆత్మకూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం జరగాల్సిన కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది. కౌన్సిల్‌లో మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉండగా ముగ్గురు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. దీంతో కౌన్సిల్ సమావేశాన్ని ఈ నెల 29వ తేదీకి వాయిదా వేసినట్లు కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. ఇదిలావుంటే కొంతకాలంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా తండ్రి, కోఆప్షన్ సభ్యులు ఎం.ఎ.రషీద్‌కు, వైసీపీ కౌన్సిలర్ల మధ్య సమన్వయం లేకపోవడంతో ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. కనీసం కౌన్సిలర్లతో చర్చించకుండా మార్చికి సంబంధించిన మున్సిపల్ కౌన్సిల్ తీర్మానాలను రూపొందించడంపై కౌన్సిలర్లు తీవ్ర మనస్తాపానికి గురై సమావేశానికి డుమ్మా కొట్టినట్లు తెలిసింది. గతకొంత కాలంగా కౌన్సిలర్లు, ఛైర్‌పర్సన్ వర్గానికి మధ్య కోల్డ్‌వార్ నడుస్తోంది. ఈవిషయంపై కీలక ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఈకేవైసీ నమోదు

తప్పనిసరి : జేసీ



నంద్యాల నూనెపల్లె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రేషన్‌కార్డుదారులు ఈకేవైసీ నమోదు ఈ నెల 31లోగా తప్పనిసరిగా చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ మంగళవారం తెలిపారు. జిల్లాలో 15,77,936 రేషన్‌కార్డుదారులకు ఇప్పటి వరకు 14,04,647మంది ఈకేవైసీ చేయించుకున్నారని మరో 1,73,289మంది కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోలేదని చెప్పారు. వీరంతా తప్పనిసరిగా సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల మొబైల్ యాప్, రేషన్‌షాపుల్లోని ఈ-పాస్ పరికరాల ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలని జేసీ వివరించారు. ఐదేళ్లల్లోపు పిల్లలు మినహా మిగిలిన లబ్ధిదారులందరూ ఈకేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. పౌర సరఫరాల శాఖ ద్వారా పంపిణీచేసే నిత్యావసరాల సరుకుల పంపిణీలో పారదర్శకత కోసం ఈ విధానాన్ని ప్రవేశపెట్టామని వెల్లడించారు.

ఈదురుగాలులతో నష్టం

దెబ్బతిన్న అరటి, మొక్కజొన్న పంటలు


నేల నేలవాలిన మొక్కజొన్న పంట

పాణ్యం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పాణ్యంలో మంగళవారం వీచిన భారీ ఈదురుగాలులకు వందలాది ఎకరాల పంటలు నేలవాలాయి. దాదాపు 50 ఎకరాల్లో అరటి పంట దెబ్బతిన్నట్లు రైతులు వాపోయారు. 30 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు నేలవాలాయి. అకస్మాత్తుగా వీచిన గాలులకు అరటి పంటలు పూర్తిగా పడిపోవడంతో ఎకరాకు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపోయిన అరటి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


విద్యుద్దీపకాంతుల్లో శ్రీశైలం ప్రధాన ఆలయం

కొండ నిండా భక్తులు



- మల్లన్న సన్నిధికి చేరుకుంటున్న కన్నడిగులు
- శ్రీశైలంలో రేపటి నుంచి ఉగాది మహోత్సవాలు
- నేటితో ముగియనున్న మల్లన్న స్పర్శ దర్శనం
- ఉత్సవాల్లో అలంకార దర్శనానికే అనుమతి
- ఇప్పటికే సందడిగా మారిన శ్రీగిరి



వాహన సేవలు



27న భృంగి వాహన సేవ, మహాలక్ష్మి అలంకారం
28న కైలాస వాహన సేవ, మహాదుర్గ అలంకారం
29న నంది వాహన సేవ, మహాసరస్వతి అలంకారం, ప్రభోత్సవం, వీరాచార విన్యాసాలు, అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాలు
30న పంచాంగ శ్రవణం, రథోత్సవం, అమ్మవారికి రమావాణి సేవిత రాజరాజేశ్వరి అలంకారం,
31న అశ్వ వాహన సేవ, భ్రమరాంబాదేవి నిజాలంకరణ, పూర్ణాహుతి

శ్రీశైలం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): అడుగులన్నీ భ్రమరాంబ సన్నిధికే.. ఆశలన్నీ అమ్మవారిపైనే.. తమ ఆడబిడ్డగా భావించి సేవించే కన్నడిగులు కర్ణాటక ప్రాంతం నుంచి శ్రీశైలానికి చేరుకుంటున్నారు. ఇప్పటికే భక్తులతో శ్రీగిరి సందడిగా మారింది. శ్రీశైల మహాక్షేత్రంలో గురువారం నుంచి ఉగాది మహోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఐదు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలు 27న స్వామివారి యాగశాల ప్రవేశంతో ప్రారంభమై 31న ముగియనున్నాయి. ఉత్సవాల సందర్భంగా దేవస్థానం భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఉత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, మహారాష్ట్ర ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రానికి తరలివస్తున్నారు. మంగళవారం శ్రీశైలంలో కన్నడ భక్తుల రద్దీతో పురవీధులన్నీ నిండుగా దర్శనమిస్తున్నాయి. భక్తుల సౌకర్యార్థం పాదయాత్ర మార్గంలో, క్షేత్ర పరిధిలో కన్నడ భక్త బృందాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు అన్నదాన శిబిరాలను నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే మంగళవారం నాటికి వేల సంఖ్యలో భక్తులు పాదయాత్రగా క్షేత్రానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా దేవస్థానం కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

దర్శనం ఏర్పాట్లు ఇలా..

ఉత్సవాల్లో క్షేత్రానికి తరలి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని భక్తులందరికీ కూడా స్వామివారి అలంకరణ దర్శనం మాత్రమే కల్పించనున్నారు. అదేవిధంగా మూడు క్యూలైన్ల ద్వారా ఉచిత దర్శనం, శీఘ్ర దర్శనం, అతిశీఘ్ర దర్శనం క్యూలైన్ల ద్వారా దర్శనం కల్పించనున్నారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు మంచినీరు, అల్పాహారం అందించేలా ఏర్పాట్లు చేశారు. బుధవారంతో స్వామివారి స్పర్శ దర్శనం నిలుపుదల చేసి గురువారం నుంచి భక్తులందరికీ స్వామివారి అలంకరణ దర్శనం మాత్రమే కల్పించనున్నారు.

అన్నప్రసాద వితరణ

దేవస్థానం భక్తులకు అన్నదాన భవనంలో అన్నప్రసాద వితరణ నిర్వహిస్తోంది. అదేవిధంగా నాగులూటి, కైలాస ద్వారం, క్షేత్ర పరిధిలోని పలు చోట్ల కన్నడ భక్త బృందాలు, సేవా సంస్థలు అన్నదానం చేస్తాయి. అన్నప్రసాద వితరణ నిర్వహించే సేవా సంస్థలన్నింటికి దేవస్థానం తరఫున సహాయ సహకారాలు అందజేస్తున్నారు.



వైద్య సేవ శిబిరాలు

జిల్లా వైద్యశాఖ సహకారంతో భక్తులకు వైద్యసేవలు దేవస్థానం వైద్యశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కైలాస ద్వారం, హఠకేశ్వరం, ఆలయ మహా ద్వారం వంటి మొదలైన ప్రదేశాలలో తాత్కాలిక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి భక్తులకు వైద్య సేవలు అందించనున్నారు.

మంచినీటి సరఫరా..

వేసవి తీవ్రత, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అందుకు అనుగుణంగా నీటి సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. క్షేత్ర పరిధిలో 11 శాశ్వత ఆర్‌సీసీ ట్యాంకులు, 34 ఆర్‌ఓ ప్లాంట్లు, 450 మంచినీటి కుళాయిలు, అందుబాటులోకి తీసుకొచ్చారు. అదేవిధంగా సాక్షి గణపతి, హఠకేశ్వరం, కైలాస ద్వారంతోపాటు క్షేత్రంలో పలుచోట్ల భక్తులు బస చేసే ప్రాంతాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. పాదయాత్రగా వచ్చే భక్తులకు కైలాస ద్వారం నుంచి భీమునికొలను మార్గమధ్యలో వెయ్యి లీటర్ల సామర్థ్యం గల ఆరు ట్యాంకులను ఏర్పాటు చేసి మంచినీటిని అందిస్తున్నారు.



తాత్కాలిక వసతి: ఉగాది మహోత్సవాలకు విచ్చేసే భక్తులకు తాత్కాలిక వసతి కల్పించేందుకు క్షేత్ర పరిధిలోని ఆరుబయట ప్రదేశాల్లో షైప్ పెండాల్స్, సామియానాలతో చలువపందిర్లు ఏర్పాటు చేశారు.

వాహనాల పార్కింగ్... పారిశుధ్యం: ఉగాది ఉత్సవాలకు అధిక సంఖ్యలో వాహనాలు వచ్చే అవకాశం ఉన్నందున క్షేత్రంలో పలుచోట్ల పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. గణేశ సదనం ఎదురుగా సెంట్రల్ పార్కింగ్, హెలిప్యాడ్ ఏరియా, ఆర్‌టీసి బస్టాండ్ వెనుక ప్రాంతం, మల్లమ్మ కన్నీరు వద్ద, గురుసదన్ ఎదురుగా పలు ప్రదేశాలలో భక్తులు వాహనాల నిలుపుకునేందుకు ఏర్పాటు చేశారు. క్షేత్రంలో పారిశుధ్య నిర్వహణకు 6 జోన్లు, 11 సెక్టార్లు, 67 ప్రదేశాలుగా విభజించి ఎప్పటికప్పుడు చెత్తాచెదారాలను తొలగించేందుకు దేవస్థానం పారిశుధ్య సిబ్బందితో పాటు అదనపు సిబ్బందితోపాటు ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుంది. అదేవిధంగా క్షేత్రపరిధిలో పలుచోట్ల తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు.



సాంస్కృతిక కార్యక్రమాలు: ఉత్సవాలకు విచ్చేసే భక్తులను అలరించేందుకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఆలయ పుష్కరిణి వద్ద, భ్రామరి కళా వేదిక, శివదీక్ష శిబిరాల వద్ద, యాంఫీ థియేటర్ వద్ద కన్నడ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవంలో కోలాటం, చెక్కభజన, పగటి వేషాలు, బుట్టబొమ్మలు, గొరవయ్యల నృత్యం, డోలు మొదలైన జానపద కళారూపాలు ఏర్పాటు చేయనున్నారు.

అభివృద్ధికి దారి లేదా..?

- జిల్లాలో విస్తరణకు నోచుకోని జాతీయ రహదారులు
- గుత్తి-మాన్వి వయా పత్తికొండ జాతీయ రహదారిగా అప్‌గ్రేడేషన్ కోసం కేంద్రానికి ప్రతిపాదన
- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం
- ఇప్పటికైనా మోక్షం లభించేనా..?


గుత్తి-ఆదోని వయా పత్తికొండ ప్రధాన రహదారి

కర్నూలు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రహదారులు ప్రగతికి చిహ్నాలు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి అనుసంధానిస్తే రాకపోకలు మెరుగుపడుతాయి. తద్వారా వ్యాపారం, ఇతర రంగాల్లో పురోగతి సాధించవచ్చు. అందులో జాతీయ రహదారులు అత్యంత ప్రధానం. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో కొలువుదీరిన ఎన్డీఏ ప్రభుత్వం జాతీయ రహదారుల విస్తరణకు నడుంబిగించింది. రాష్ట్ర ప్రధాన రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడేషన్ కోసం ప్రతిపాదనలు స్వీకరించింది. నిత్యం కరువుతో తల్లడిల్లే పశ్చిమ ప్రాంతం అభివృద్ధిలో కీలకమైన గుత్తి-మాన్వి వయా పత్తికొండ, ఆదోని రోడ్డును నేషనల్ హైవేగా అప్‌గ్రేడేషన్ కోసం 2017లోనే సర్వే చేసి కేంద్ర రోడ్లు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపారు. అత్యంత కీలకమైన కర్నూలు-బళ్లారి వయా కోడుమూరు, ఆలూరు రోడ్డు.. ఓర్వకల్లులోని కాల్వబుగ్గ-ఎమ్మిగనూరు వయా వెల్దుర్తి, కోడుమూరు, గోనెగండ్ల రోడ్లను నేషనల్ హైవేగా విస్తరించాలని రెండేళ్ల క్రితమే ప్రతిపాదనలు పంపారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా మారింది. సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం రావడం, కేంద్రంలో ప్రధాని మోదీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వంతో సఖ్యతగా ఉండడంతో జాతీయ రహదారుల విస్తరణపై ఆశలు చిగురిస్తున్నాయి. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు సహా ఎమ్మెల్యేలు దృష్టి సారించాలి.

ఎనిమిదేళ్ల స్వప్నం

గుత్తి-మాన్వి వయా పత్తికొండ, ఆదోని ప్రధాన రోడ్డును జాతీయ రహదారి విస్తరణ ఎనిమిదేళ్ల స్వప్నం. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ ఈ రోడ్డు విస్తరణకు సర్వే చేయించారు. ఉత్తర కర్ణాటకలోని రాయచూరు, సింధనూరు, మాన్వి, గంగావతి వంటి ప్రాంతాల ప్రజలు రాజధాని బెంగళూరుకు వెళ్లేందుకు దూరం తగ్గుతుంది. అలాగే జిల్లాలో ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆలూరు ప్రాంతవాసులు అనంతపురం, బెంగళూరు వెళ్లాలంటే ఈ మార్గమే ఆధారం. బెంగళూరులో జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు వేలాది మంది పని చేస్తున్నారు. కీలకమైన గుత్తి-మాన్వి వయా పత్తికొండ, ఆదోని రోడ్డును నేషనల్ హైవేగా విస్తరించాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. హైదరాబాద్-బెంగళూరు వయా కర్నూలు, అనంతపురం జాతీయ రహదారిని గుత్తి వద్ద కలుపుతూ గుత్తి, పత్తికొండ, ఆదోని, మదిరె, హానవాల్, కుంటనహాల్, ఉప్పరహాల్, కౌతాళం, ఉరుకుంద, హాల్వి, కుంబళనూరు మీదుగా కర్ణాటక రాష్ట్రంలోని మాన్వి వరకు జాతీయ రహదారిగా విస్తరించాలని ప్రతిపాదించారు. సర్వే కోసం 2017 జూన్‌లో టెండర్లు పిలిచారు. ఆ వెంటనే సర్వే పూర్తి చేసి తుంగభద్ర నదిపై వంతెన నిర్మాణంతోపాటు ఏఏ ప్రాంతంలో కల్వర్టు నిర్మించాలి, సింగిల్ రోడ్డు ఎన్ని కిలోమీటర్లు, డబుల్ రోడ్డు ఎన్ని కిలోమీటర్లు అనేది తేలాచ్చారు. ప్రాథమికంగా 135 కిలోమీటర్ల రోడ్డును జాతీయ రహదారిగా అప్‌గ్రేడేషన్ చేయాలని కేంద్ర రోడ్లు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో నిర్లక్ష్యం కారణంగా ఆ ప్రతిపాదన అటకెక్కింది.

మిగతా 6వ పేజీలో

మలన్న సేవలో కర్ణాటక గవర్నర్


స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో

శ్రీశైలం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను మంగళవారం కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో కర్ణాటక గవర్నర్‌కు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈవో స్వామివార్ల చిత్రపటాన్ని అందజేశారు.

ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్పీ : శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల దర్శనార్థం కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ శ్రీశైలం పర్యటించనున్న సందర్భంగా మంగళవారం నంద్యాల జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, శ్రీశైలం సీఐ జి. ప్రసాదరావు ఉన్నారు.

కలెక్టర్ల సమావేశానికి

హాజరైన రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో సీఎం నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరుగుతున్న కలెక్టర్ల సమావేశంలో నంద్యాల కలెక్టర్ రాజకుమారి హాజరయ్యారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశంలో బుధవారం సీఎం చంద్రబాబుకు నంద్యాల జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై కలెక్టర్ వివరించనున్నారు. జిల్లాలో సాధించిన పురోగతి, భవిష్యత్ ప్రణాళికలను ఆమె సీఎంకు దృష్టికి తీసుకురానున్నారు.


కలెక్టర్ల సమావేశంలో పాల్గొన్న రాజకుమారి



చెత్త కేసీ చూడండి..!

డంప్ యార్డును తలపిస్తున్న కెనాల్

కర్నూలు న్యూసిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డున ప్రవహిస్తున్న కేసీ కెనాల్ డంప్ యార్డును తలపిస్తోంది. నగరంలోని చెత్తా చెదారమంతా కేసీ కెనాల్‌లో పడేస్తుండడంతో గుట్టలుగా పేరుకుపోయింది. ప్రస్తుతం కేసీ కెనాల్‌లో నీరు లేకపోవడంతో చెత్తా చెదారంతో నిండిన కేసీ కెనాల్ నుంచి సమీప నివాస ప్రజలకు దుర్వాసన వెదజల్లుతోంది. అయితే ఇదంతా కేసీ కెనాల్ పరివాహక ప్రాంతాల ప్రజలే అందులో వేస్తున్నారని నగర పాలక అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో కేసీ కెనాల్‌ను ప్రక్షాళన చేసి ప్రజలు రోగాలబారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత నగర పాలక, ఇరిగేషన్ అధికారులపై ఉంది.

భ్రామరికి పుట్టింటి సారె..!



కావడిలను మోస్తూ శ్రీశైలానికి కాలినడకన వెళ్తున్న కన్నడ భక్తులు

- ఆడపడుచు వాయన సమర్పణకు కన్నడిగుల పాదయాత్ర
- శతాబ్దాలుగా కొనసాగుతున్న ఆచారం
- మండుటెండలను లెక్కచేయని భక్తిపారవశ్యం
- వందల కి.మీ. దూరం నుంచి రోజుల తరబడి ప్రయాణం

ఆత్మకూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): తమ ఇంటి ఆడపడుచుకు పుట్టించి సారెను సమర్పించేందుకు కన్నడిగులు వందలాది కిమీల నుంచి పాదయాత్రగా తరలివస్తున్నారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా మల్లన్న సన్నిధికి చేరుకుంటున్నారు. శ్రీశైలంలో ప్రతిఏటా జరిగే ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని పాల్గుణ మాసంలో కన్నడిగులు శ్రీశైలానికి పాదయాత్రగా తరలివస్తారు. ప్రత్యేకించి శ్రీశైలేషుని ధర్మపత్ని భ్రమరాంబిక అమ్మవారిని కన్నడిగులు సాక్ష్యాత్తు తమ ఆడపడుచుగా భావించి పుట్టింటి సారెను (పసుపు, కుంకుమ, గాజులు, వస్త్రాలు, వడిబియ్యం) సమర్పించేందుకు శతాబ్దాల కాలం నుంచి కాలినడకన అమ్మవారి సన్నిధిగా చేరుకుంటారు. ఉగాది పర్వదినాన్ని ముందే కన్నడిగులు శ్రీశైలానికి చేరుకొని అమ్మవారికి పుట్టింటిసారే సమర్పించి తమ భక్తిపారవశ్యాన్ని చాటుకుంటారు. అలాగే భ్రామరీ అమ్మవారికి మిరియాల చూర్ణాన్ని (మిరియాలపట్టు) కూడా నుదుటన ఉంచేందుకు తీసుకొస్తారు. ఎందుకంటే శ్రీశైలంలో జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో క్షేత్రానికి లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. ఆ సమయంలో భక్తుల రద్దీతో అమ్మవారికి తలపోటు వచ్చిందేమోనన్న భావనతో తమ ఆడపడుచుకు ఆ కష్టాన్ని తొలగించాలన్న ఉద్దేశంతో మిరియాల పట్టును తీసుకురావడం సంప్రదాయంగా వస్తోంది. ఎంతో విశేష ప్రాశస్త్యం కలిగిన కన్నడిగుల పాదయాత్ర శ్రీశైల క్షేత్ర ఆవిర్భావం నుంచే కొనసాగుతున్నట్లు పురాణాలు చెబుతున్నాయి.



నల్లమల అటవీ మార్గం మీదుగా కాలినడకన వెళ్తున్న కన్నడ భక్తులు

వందల మైళ్ల నుంచి పాదయాత్ర

కర్ణాటక రాష్ట్రంలోని బైచ్‌వాల్, కన్నల్లి, కూడలి, కెంపాలి, సోలాపూర్, బాగల్‌కోట, అత్తిని, బళ్లారి, గుల్బర్గ, ఉగ్లీ, సింధిని, కచనూర్, అరికెరి, రాయచూర్, వంటి సుదూర ప్రాంతాల నుంచి వందలాది కిలోమీటర్లు కాలినడకన పాదయాత్ర చేస్తు వస్తుంటారు. ఇందుకోసం దాదాపు పక్షం నుంచి నెల రోజుల ముందు తమ సొంత ప్రాంతాల నుంచి పాదయాత్రను ప్రారంభిస్తారు. కొంతమంది మొక్కుబడిగా కాళ్లకు కర్రలు ధరించి పాదయాత్ర సాగిస్తుంటారు. అటవీమార్గం వరకు కర్రలపైనే నడిచి తమభక్తిని చాటుకుంటారు. కొందరైతే అమ్మవారికి సమర్పించే సారేతో కూడిన కావడిలను మోస్తూ పాదయాత్రగా వెళ్తుంటారు.

పాదయాత్ర సాగేదిలా..!

సుదూర ప్రాంతాల నుంచి కాలినడన ఆత్మకూరుకు వచ్చే కన్నడిగులు అక్కడి నుంచి పాదయాత్ర ద్వారానే వెంకటాపురం గ్రామానికి చేరుకుంటారు. అక్కడ వీలైతే కాసింత సమయం సేదతీరి పంట పొలాల మార్గం గుండా అటవీమార్గంలో ప్రవేశించి బైర్లూటి వీరాంజనేయ స్వామి ఆలయాన్ని దర్శిస్తారు. ఆ తర్వాత వారు బైర్లూటి మీదుగా నాగలూటి వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం నాగలూటి తిప్పలుపై నడుస్తూ దాదాపు 16 కిమీల దూరంలో ఉన్న పెచ్చెర్వు చెంచుగిరిజన గూడేనికి చేరుకుంటారు. ఈ ప్రాంతాల చాలా వరకు భక్తులు కొంత సమయం పాటు సేదతీరుతారు. అక్కడి నుంచి తిప్పలు, అటవీ మార్గం గుండా సుమారు 18 కిమీలు నడిచి భీమునికొలను ప్రాంతానికి చేరుతారు. అక్కడి నుంచి మరో 5 కిమీల దూరంలో హటకేశ్వరం, ఆ తర్వాత 6 కిమీల దూరంలో శ్రీశైల మహాక్షేత్రానికి చేరుకుంటారు. మార్గమధ్యంలో పెద్దచెరువు, భీముని కొలను ప్రాంతాల మధ్యలో వెలసిన కోర్కెల కొండలో కన్నడిగులు కోర్కెలు నెరవేరాలంటూ వృక్షాలకు కాశాయరంగు వస్త్రంతో ఊయలకట్టి అందులో ఏదైనా వస్తువును ఉంచి నమస్కరిస్తారు. అలాగే మరికొందరు సొంత నిర్మాణ స్వప్నాన్ని నిజం చేసుకునేందుకు అక్కడ వున్న కొండరాళ్లను ఒకదానిపై ఒకటి అమర్చుతారు. అంతేకాకుండా మరికొందరు సంతాన ప్రాప్తికై తమ మొక్కుబడులను ఈ కొండపైనే తీర్చుకుంటుంటారు.



కోర్కెల కొండపై సంతానం కోసం ఊయల కడుతున్న భక్తులు



కోర్కెల కొండపై కన్నడిగులు అమర్చిన రాళ్ల నిర్మాణాలు



25 సార్లు శ్రీశైలానికి కాలినడకన వచ్చా

మాది కర్ణాటక రాష్ట్రంలోని సోలాపూర్ ప్రాంతం. ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని 25ఏళ్లుగా ప్రతిఏటా శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనార్థం కాలినడకన వస్తున్నాను. పదిరోజులుగా 600 కిమీలు ప్రయాణించి ఇక్కడికి చేరుకున్నాను. శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లపై తమకు వున్న భక్తిబావమే మమ్మల్ని శ్రీశైలానికి చేరవేస్తోంది. మల్లన్నే మాకు ఏకష్టం రానివ్వకుండా తమ యాత్రను పూర్తిచేస్తాడని మా నమ్మకం.

- చిదాంబరాయ్, సోలాపూర్, కర్ణాటక రాష్ట్రం



మల్లన్నపై అపారమైన నమ్మకం

శ్రీశైల మల్లన్నపై అపారమైన నమ్మకం, భక్తితోనే వందల కిలోమీటర్ల నుంచి పాదయాత్ర చేస్తున్నాం. ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని ఇప్పటి వరకు 15 సార్లు శ్రీశైలానికి కాలినడకన వచ్చాను. మల్లన్న దయతో తనకు శక్తి ఉన్నంతవరకు శ్రీశైలానికి రావాలని భావిస్తున్నాను. ఇలా పాదయాత్రగా వెళ్లడం వల్ల మంచి జరుగుతోంది. ఎంతో మంది భ్రమరాంబ అమ్మవారికి వాయనం సమర్పించేందుకు శ్రీశైలానికి కాలినడకన వస్తున్నారు.

- గౌరీబాయి, సోలాపూర్, కర్ణాటక రాష్ట్రం

నిప్పుతో జాగ్రత్త

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- అప్రమత్తతోనే అగ్ని ప్రమాదాల నివారణ
- 24 గంటలు అందుబాటులో ఉంటాం
- మంత్రాలయం, ఓర్వకల్లులో ఫైర్ స్టేషన్లకు ప్రతిపాదనలు
- డీఎఫ్‌వో అవినాశ్ జయసింహ



కర్నూలు క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎండలు మండుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు చేరుకుంది. ఇంత ఎండల్లో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే ఆస్తినష్టం, ప్రాణనష్టం తప్పదు. ఈ సందర్భంగా జిల్లాలో అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక శాఖ అధికారులు తీసుకుంటున్న చర్యలు, ప్రణాళికలు తదితర అంశాలపై జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి (డీఎఫ్‌వో) అవినాశ్ జయసింహ చెప్పిన కొన్ని అంశాలు.



- **ప్రశ్న:** జిల్లా వ్యాప్తంగా ఎన్ని అగ్నిమాపక కేంద్రాలు.. ఫైరింజన్లు, సిబ్బంది ఉన్నారు...?
- **డీఎఫ్‌వో:** జిల్లా వ్యాప్తంగా కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ, ఆలూరులో ఆరు ఆరు ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. కర్నూలులో రెండు ఫైరింజన్లతో పాటు ఒక రెస్క్యూటీం వాహనం, ఆదోనిలో రెండు ఫైరింజన్లు, కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ ఆలూరులో ఒక్కొక్కటి చొప్పున ఫైరింజన్లు ఉన్నాయి. వీటితో పాటు మిస్టి వాహనాలు కూడా ఉన్నాయి.
- **ప్రశ్న:** ప్రమాదాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారా..?
- **డీఎఫ్‌వో:** వేసవిలో ఎక్కువగా పంట పొలాల్లో, గడ్డివాములకు నిప్పంటుకుంటాయి. ఫైర్ స్టేషన్‌కు కాల్ వచ్చిన వెంటనే సిబ్బంది ఘటనా స్థలానికి బయలుదేరి వెళ్తారు. ఘటనా స్థలానికి చేరుకోవడానికి అటు ఇటూ ఆలస్యమైనా కూడా ప్రమాదాలు నివారించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం.
- **ప్రశ్న:** సిబ్బంది కొరత ఏమైనా ఉందా..?
- **డీఎఫ్‌వో:** జిల్లా వ్యాప్తంగా 6 ఫైర్ స్టేషన్‌లలో 34 మంది ఫైర్‌మెన్లు, ఆరుగురు డ్రైవర్ ఆపరేటర్ల కొరత ఉంది. కర్నూలులో 21 ఫైర్‌మెన్ల పోస్టులు ఉండగా.. 16 మందే ఉన్నారు. 7 డ్రైవర్ ఆపరేటర్ల పోస్టులు ఉండగా.. ఆరుగురే ఉన్నారు. ఆదోనిలో 19 మంది ఫైర్‌మెన్ల పోస్టులు ఉండగా.. 9 మంది, ఎమ్మిగనూరులో 9 మందికిగాను నలుగురు విధుల్లో ఉన్నారు. అలాగే కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండలలో 9మంది ఫైర్‌మెన్ల పోస్టులు ఉండగా.. నలుగురు, ముగ్గురు చొప్పున ఉన్నారు. మంత్రాలయం ఫైర్ స్టేషన్ కోసం ప్రతిపాదనలు పంపాం. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు దగ్గర ఒక ఫైర్ స్టేషన్‌కు ప్రతిపాదనలు పంపాం. ఆదోనిలో ఒక మిస్టి వాహనం కావాలి.
- **ప్రశ్న:** అగ్ని ప్రమాదాల గుర్తింపు ఎలా?
- **డీఎఫ్‌వో:** విద్యుత్ లైన్ల కింద గడ్డివాములు ఉంటే వేసవిలో వచ్చే గాలులకు తీగలు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు చెలరేగి గడ్డివాముల మీద పడే అవకాశం ఉంది. గడ్డివాములకు దగ్గరలో గాజుముక్కలు, గాజు సీసాలు ఉంటే ఎండాకాలంలో వాటి మీద సూర్యకిరణాలు పడి నిప్పు అంటుకుంటుంది. కేర్‌లెస్ స్మోకింగ్ వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయి. రాత్రి వేళలో గ్యాస్ సిలిండర్లు ఆఫ్ చేయాలి. ఏసీ, ఫ్రీజర్ షాట్ సర్క్యూట్ వల్ల ప్రమాదాలు జరుగుతాయి.
- **ప్రశ్న:** తనిఖీలపై విమర్శలు వస్తున్నాయి?
- **డీఎఫ్‌వో:** నిరంతరం తనిఖీలు చేస్తూనే ఉన్నాము. గతంలో ప్రతి ఏడాది ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉండేది. ప్రస్తుతం మూడేళ్లకు ఒకసారి తీసుకునే వెసలుబాటు కల్పించారు. దీంతో పాటు ఎన్‌వోసీ జారీ చేసే అధికారి డీజీపీకే ఉంటుంది. మంటలు చెలరేగితే.. ఇసుక, పచ్చని కొమ్మలతో మంటలను ఆర్పేయాలి. ఇళ్లలో గ్యాస్ లీకైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నాం. గ్యాస్ లీకైతే కిటికీలు, తలుపులు తెరవాలి.

ప్రమాదాలు సంప్రదించండిలా..: ప్రమాదాలు జరిగితే 101కు కాల్ చేయాలి. అలాగే జిల్లా వ్యాప్తంగా ఆరు ఫైర్ స్టేషన్ల ఫోన్ నెంబర్లు ఉన్నాయి. వారికి కూడా కాల్ చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

ఫైర్ స్టేషన్	ఫోన్ నెంబర్లు	ల్యాండ్ నెంబర్లు
కర్నూలు	9963737924	08518-255101
ఆదోని	9963738169	08512-252299
ఎమ్మిగనూరు	9963738627	08512-255101
కోడుమూరు	9963739051	08525-228188
ఆలూరు	9963739178	08523-229088
పత్తికొండ	9963739458	08520-226700

30న టీజీవీ కళా క్షేత్రంలో ఉగాది సంబరాలు

అవార్డులకు పలువురి ఎంపిక

కర్నూలు కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకను పురస్కరించుకుని ఈ నెల 30న సాయంత్రం 5:30 గంటలకు ఉగాది సంబరాలు నిర్వహిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్ష, కార్యదర్శులు పత్తి ఓబులయ్య, మహ్మద్ మియా మంగళవారం తెలిపారు. టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సాయంత్రం 5:30 గంటలకు కృష్ణ బృందంచే నాదస్వర కచేరీతో సంబరాలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం భాను స్వామిచే నూతన తెలుగు సంవత్సర పంచాంగ శ్రవణం, కరీముల్లా బృందంచే సంగీతం, నృత్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ప్రముఖ కవి ఇనాయతుల్లా బృందంచే ఉగాది కవి సమ్మేళనం, అనంతరం వివిధ రంగాల్లో నిష్ణాతులైన తొమ్మిదిమంది ప్రముఖులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. విద్యారంగంలో జి.పుల్లయ్య, పద్య నాటకంలో పి.దస్తగిరి, సంగీతంలో గీతాంజలి, సాహిత్యంలో జంధ్యాల రఘుబాబు, నృత్యంలో పి.మీనాసాయి, జర్నలిజంలో మండిరాజు శ్రీనివాసరాజు, హరికథలో మంజుల, చిత్రలేఖనంలో దాసరి వెంకటరమణ, వాస్తులో ఎం.వినీలాను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేశ్‌తో పాటు అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ



పోలీసు అధికారులు, సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ

శ్రీశైలం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా సూచించారు. శ్రీశైలంలో ఉగాది మహోత్సవాల సందర్భంగా బందోబస్తుకు వచ్చిన పోలీసు అధికారులకు, సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు వారికి కేటాయించిన ప్రాంతంలోనే విధులు నిర్వహించాలని, భక్తుల పట్ల మర్యాదగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య తలెకత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్ పాల్గొన్నారు.

నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

కర్నూలు లీగల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయవాదిపై కర్నూలు తాలుకా పోలీసులు నమోదు చేసిన కేసుకు వ్యతిరేకంగా బుధవారం న్యాయవాదులు తమ కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.కృష్ణమూర్తి, బీఎస్ రవికాంత్ ప్రసాద్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు జిల్లాకు చెందిన హైకోర్టు న్యాయవాది వి.మహేంద్రనాథ్ రెడి తన బంధువుల తరపున కర్నూలు తాలుకా పోలీసుల వైఖరికి వ్యతిరేకంగా ప్రశ్నించాడని, దానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఈ అక్రమ కేసును నిరసిస్తూ తాము కోర్టు విధులను బుధవారం బహిష్కరిస్తున్నట్లు వారు తెలిపారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాది ఇజ్రాయెల్ హత్యను కూడా తాము ఖండిస్తున్నామని, నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

జల సంరక్షణకు ఉపాధి నిధులు

ఉమ్మడి జిల్లాలో 11 వేల నీటి కుంటల ఏర్పాటుకు చర్యలు

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వర్షపాతం తక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో సాగునీటికి ఇబ్బందులు తప్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా నంద్యాల, కర్నూలు జిల్లాలో 11వేల నీటి కుంటలు తవ్వేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా నిధులను సమకూర్చుతూ చర్యలు తీసుకుంది. కర్నూలు జిల్లాలో 8,500, నంద్యాల జిల్లాలో 2,500 నీటి కుంటలను వచ్చే మూడు నెలల్లోగా పూర్తి చేయాలని నీటి యాజమాన్య సంస్థ యంత్రాంగానికి ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. ఒక్కో నీటి కుంట నిర్మాణానికి రూ.40 వేల దాకా ఖర్చు అవుతుందని, రెండు జిల్లాలో 11వేల నీటి కుంటల నిర్మాణానికి కూలీలు, కూలీతో పాటు మెటీరియల్ కలిపి రూ.45 కోట్లు ఖర్చు చేయనున్నట్లు కర్నూలు, నంద్యాల జిల్లాల డ్వామా పీడీలు వెంకటసుబ్బయ్య, వెంకటరమణయ్యలు తెలిపారు.



- నీటి కుంటల విస్తీర్ణం మూడు రకాలుగా ఉండేలా రూపొందించారు. 8/8 సైజుతో పాటు 10/10, 20/20 సైజుతో నీటి కుంటలను గ్రామ పంచాయతీలు, పొలాల్లో ఏర్పాటు చేస్తారు.
- నీటి కుంటల ద్వారా వాన నీరు వృథా కాదు. పొలంలో నీటి కుంట తవ్వుకుంటే స్థలం వృథా అవుతున్నట్లు చాలా మంది రైతులు భావిస్తున్నారు. కానీ ఇది వాస్తవం కాదు. ఒకే రకం భూమిలో సుమారు 3 సెంట్ల నీటి కుంట తవ్వుకుంటే ఆ నీటి నిల్వతో మిగిలిన 97 సెంట్ల భూమిలో పంటలు సాగు చేయవచ్చు. కొద్దిపాటి వర్షం పడినా నీరు కుంటలో నిల్వ ఉంటుంది.
- నీటి కుంట చుట్టూ రెండేసి వరసల్లో ఘట్లను నిర్మిస్తారు. ఇందులో ఒక వరుసలో కూరగాయల సాగు, రెండో వరుసలో పండ్ల మొక్కల పెంపకం చేపట్టేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు.
- నీటి కుంటలో ఇన్‌లెట్, ఔట్‌లెట్ ఉండేలా విధిగా నీటిని వినియోగించుకునేలా చర్యలు చేపట్టారు. వేసవి కాలంలో ఈ నీటి కుంటలు అందించే ప్రయోజనం ఎంతో ఎక్కువగా ఉంటుంది. రాబోయే మూడు నెలల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు నీటి కుంటల నిర్మాణాన్ని పూర్తి చేసి రైతులకు ప్రయోజనం కల్పించేదిశగా అధికారులు చర్యలు ముమ్మరం చేశారు.

అభివృద్ధికి దారి లేదా..?

(5వ పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం రావడంపై గుంతకల్లు, పత్తికొండ, ఆదోని ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, కేఈ శ్యాంబాబు, డాక్టర్ పీవీ పార్థసారథి, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డిలు ఒత్తిడి తెచ్చి ఈ రోడ్డును నేషనల్ హైవేగా అప్‌గ్రేడేషన్ చేసేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.



కోడుమూరు-ఎమ్మిగనూరు వయా గోనెగండ్ల ప్రధాన రహదారి

ఆ రెండు రోడ్లు కూడా..!

కర్నూలు - బళ్లారి వయా కోడుమూరు, ఆలూరు ప్రధాన రహదారిని జాతీయ రాహదారిగా విస్తరించాలనే ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగులో ఉంది. ఇది జిల్లాలో అన్ని నియోజకవర్గాలను అనుసంధానం చేసే కీలకమైన రోడ్డు. కర్నూలు నుంచి కోడుమూరు, దేవనకొండ, ఆస్పరి మీదుగా ఆలూరు వరకు, హాలహర్వి మండలం ఛత్రగుడి నుంచి మోకా మీదుగా 126 కిలోమీటర్లు నేషనల్ హైవేగా అప్‌గ్రేడేషన్ చేయాలి. మంగళవారం ప్రారంభమైన జిల్లా కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లేందుకు కలెక్టరు పి.రంజిత్‌బాషా నివేదికతో వెళ్లారు. కర్నూలు ఎమ్మెల్యే, మంత్రి టీజీ భరత్ సహా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్‌లు నేషనల్ హైవేగా విస్తరణకు కృషి చేయాలి.

- కాల్వబుగ్గ - ఎమ్మిగనూరు వయా రామళ్లకోట, వెల్దుర్తి, లద్దగిరి, కోడుమూరు, గోనెగండ్ల మీదుగా 110 కిలో మీటర్ల రోడ్డును జాతీయ రహదారిగా విస్తరించి కర్నూలు - చిత్తూరు వయా నంద్యాల జాతీయ రహదారి, బళ్లారి-జడ్చర్ల వయా ఎమ్మిగనూరు, మంత్రాలయం జాతీయ రహదారి-167ను అనుసంధానం చేయాలనే ప్రతిపాదనను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు ప్రతిపాదన పంపారు. ముఖ్యంగా కోడుమూరు-ఎమ్మిగనూరు వయా గోనెగండ్ల రోడ్డు అధ్వానంగా ఉంది. ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని నియోజకవర్గాల ప్రజలు వివిధ పనుల కోసం కర్నూలు రావాలంటే ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. గత ఎన్నికల్లో ఎమ్మిగనూరు టీడీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి నేషనల్ హైవేగా విస్తరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆయనతో పాటు కోడుమూరు, పత్తికొండ, పాణ్యం ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, కేఈ శ్యాంబాబు, గౌరు చరితమ్మలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం

గుత్తి-మాన్వి వయా పత్తికొండ, ఆదోని, కర్నూలు-బళ్లారి వయా కోడుమూరు, ఆలూరు, కాల్వబుగ్గ-ఎమ్మిగనూరు వయా వెల్దుర్తి, కోడుమూరు ప్రధాన రోడ్లను జాతీయ రహదారులుగా విస్తరించాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపాం. రెండేళ్లుగా కేంద్రంలో ప్రతిపాదనలు పెండింగులో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం నేషనల్ హైవేగా అప్‌గ్రేడేషన్‌కు ఆమోదం తెలిపి నిధులు ఇస్తే నిబంధనలు ప్రకారం డీపీఆర్ తయారు చేసి దశల వారిగా రోడ్డును విస్తరిస్తాం.

- శంకర్‌రెడ్డి, ఈఈ, జాతీయ రహదారుల శాఖ (ఎన్‌హెచ్), కర్నూలు

నేలకొరిగిన అరటి

నష్టాల ఊబిలో రైతన్న



నేలకొరిగిన అరటి పంట

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సాగు చేసిన అరటి పంట నేలకొరిగింది. దీంతో లక్షలు వెచ్చించి పంటను సాగుచేసిన రైతన్నలు నష్టాల పాలయ్యారు. మండలంలో చెన్నాపురం, బోడబండ, దేవిబెట్ట గ్రామాల్లో దాదాపు తొమ్మిది ఎకరాల వరకు రైతులు ఈ ఏడాది అరటి పంటలను సాగు చేశారు. అయితే పంట ఏపుగా పెరిగి కాయలు కాసే సమయంలో ఈదురు గాలులు, వర్షం రావడంతో అరటి మొక్కలు నేలకొరిగాయి. దీంతో రైతన్నలు పంటను కాపాడుకునేందుకు కట్టెలను అడ్డుపెట్టడం, తాళ్లతో కట్టి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. నష్టపోయిన రైతన్నలను ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నేలకొరిగిన అరటి పంటను చూపుతున్న రైతు గురువ లక్ష్మీకాంత్

నేటి నుంచి వచ్చే నెల 1 వరకు కర్నూలు మార్కెట్ యార్డుకు సెలవు

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డుకు నేటినుంచి ఏప్రిల్ వరకు సెలవు ప్రకటించినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మాట్లాడుతూ వ్యాపారులు ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న కారణంగా ఆర్థిక లావాదేవీలు సరి చూసుకోవాల్సి ఉండటంతో కొనుగోళ్లు జరపలేమన్నారు. రైతులు ఏప్రిల్ 1వ తేదీ వరకు ఎండు మిర్చి, వామును యార్డుకు తీసుకు రావద్దని విజ్ఞప్తి చేశారు.

అర్చకుల మధ్య ఘర్షణ

• కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు

కొత్తపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన కొలనుభా రతి క్షేత్రంలో శివపురం గ్రామానికి చెందిన ప్రధాన అర్చకుడు, దినసరి వేతనం కింద పని చేస్తున్న ఓ అర్చకుడి మధ్య సోమవారం ఘర్షణ జరిగింది. వీరిద్దరూ మంగళవారం కొత్తపల్లి పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ కేశవను వివరణ కోరగా ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చామని చెప్పారు.

కంప్రెషర్ పేలుడులో ముగ్గురికి రిమాండ్

సి. బెళగల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కంప్రెషర్ పేలుడులో ముగ్గురికి రిమాండ్ తరలించినట్లు కోడుమూరు సీఐ తబ్రేజ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా కంప్రెషర్, యజమాని రాజు, రైతు మోహీనుద్దీన్, డిటోనేటర్లు విక్రయించిన శ్రీనివాసులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. పొలాల్లో డిటోనేటర్లతో గుండ్లు పేలుస్తే తమకు సమాచారం అందజేయాలన్నారు. లైసెన్స్ లేకుండా పేలుడు పదార్థాలను విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏఎస్ఐ నాగయ్య, హెడ్ కానిస్టేబుల్స్ తిమప్ప, గౌడు, దస్తగిరి ఉన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. నలుగురికి గాయాలు

జూపాడుబంగ్లా, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.లింగాపురం గ్రామ పొలిమేరలో పొలం విషయంలో ఇరువర్గాల మధ్య మంగళవారం ఘర్షణ పడ్డారు. ఇరువర్గాలు కట్టెలతో దాడులు చేసుకోవడంతో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ దాడిలో వైసీపీ మద్దతుదారులు పి.లింగాపురం సర్పంచ్ నాగార్జునరెడ్డి, రాజకుమార్ రెడ్డి, రవి జూపాడుబంగ్లా గ్రామానికి చెందిన టీడీపీ మద్దతుదారుడు పెద్దన్న కుమారుడు వెంకటయ్యకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇరువర్గాల పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువర్గాలను విచారించి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

బండిఆత్మకూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సంతజూటూరు, బండిఆత్మకూరు మధ్య కారు బైకును ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం పెద్ద నాగులవరం గ్రామానికి చెందిన వెంకట నాగరాజు(21) ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. నారాణపురం గ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ అక్బర్ తెలిపారు.

గుర్తు తెలియని భక్తురాలి మృతి

మంత్రాలయం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంగభద్ర రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని భక్తురాలు (50) మృతి చెందినట్లు మాధవరం హెడ్ కానిస్టేబుల్ వీరేష్ తెలిపారు. మంగళవారం ఉదయం రాఘవేంద్రస్వామిని దర్శించుకుని తుంగభద్ర రైల్వేస్టేషన్‌కు వచ్చింది. ఎండ వేడిమి తట్టుకోలేక మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి దగ్గర చీర, కొబ్బరికాయ ఉన్నట్లు గుర్తించారు. ఎటువంటి ఆచూకీ లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని మహిళ మృతదేహంగా పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె వద్ద ఉన్న దుస్తులను మాధవరం పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



ఉదయ్ (ఫైల్)

ఆదోని, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటన ఆదోని పట్టణంలోని క్రాంతినగర్ కాలనీలో సోమవారం రాత్రి చోటు చేసుకోగా, మంగళవారం గుర్తిం చారు. వివరాలు.. పట్టణంలోని క్రాంతినగర్ కాలనీకి చెందిన ఉదయ్ (21) బేల్దారి పని చేస్తూ కుటుం బానికి ఆసరాగా ఉండేవాడు. సోమవారం రాత్రి ఇంటికి వచ్చాక రూములో వెళ్లి తలుపు వేసుకు న్నాడు. ఉదయం ఎంతకీ తలుపు తీయకపోవడం తో కుటుంబ సభ్యులు లోపలికి చూడగా స్లాబుకు ఉన్న కొక్కానికి ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కొంత కాలంగా కడుపునొప్పుతో బాధపడేవాడని తల్లి నరసమ్మ పేర్కొంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని టూ టౌన్ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



గురుస్వామి

ఆలూరు రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో చికిత్స పొందుతూ వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. మండలంలోని కురవళ్లి గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున గ్యాస్ సిలిండర్ పేలడంతో గురుస్వామి, భార్య గాయత్రీతో పాటు కుమారుడు ధర్మకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించిన విషయం విధితమే. తీవ్ర గాయాలైన గురుస్వామి (39) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. గురుస్వామి మృతిపై గ్రామ సర్పంచ్ ఉప్పర రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు ఈరప్ప, మల్లయ్య, పెద్దయ్య ప్రగాఢ సానుభూతి తెలిపారు.

'రైతుల ఆస్తుల జప్తు దారుణం'

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అప్పులు కట్టలేదన్న కారణంతో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు రైతుల ఇళ్లకు వెళ్లి టీవీలు, మోటారు సైకిళ్లను తీసుకెళ్లడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మండిపడ్డారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రైతులు పంటలు పండక, గిట్టుబాటు ధర అందక పంట సాగు కోసం చేసిన అప్పులు దిద్దలేక వలసబాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం తదితర నియోజకవర్గాల్లో గ్రామాలకు గ్రామాలు వలసలకు వెళ్లడంతో ఖాళీ అయిపోయాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం వాళ్లను ఆదుకోవాల్సింది పోయి ఉపాధిని కల్పించకుండా రుణ బకాయిలు చెల్లించాలని ఏ విధంగా ఆదేశిస్తుందని గిడ్డయ్య ప్రశ్నించారు. ఆలూరు నియోజకవర్గంలోని బెల్డోనలో సోమవారం జిల్లా సహాకార కేంద్ర బ్యాంకు అధికారులు రైతుల ఇళ్లలోకి చొరబడి టీవీలు, మోటారు సైకిళ్లు ఎత్తుకెళ్లడం దారుణమని, మరోసారి ఇటువంటి దారుణాలు జరగకుండా అన్ని బ్యాంకుల అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ

కర్నూలు న్యూసిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఇటీవల ప్రిసైడింగ్ అధికారులు నియమితులయ్యారు. జడ్పీలో సీఈవో జి.నాసరరెడ్డి ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. జిల్లా పరిషత్ కో ఆప్టెడ్ ఎన్నిక పర్యవేక్షణలో జడ్పీ సమావేశం భవనంలో జరుగుతుందన్నారు. అదేవిధంగా తుగ్గలి, వెల్దుర్తి ఎంపీపీ ఎన్నికలు, క్రిష్ణగిరి కో ఆప్టెడ్ ఎన్నికలు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. 27న నామినేషన్, పరిశీలన, జాబితా ప్రచురణ, అదేరోజు మధ్యాహ్నం ఎన్నికలు జరుగుతాయన్నారు. జడ్పీ కో ఆప్టెడ్ ఎన్నికకు సంబంధించి ఎంపీ,ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలకు నోటీసులు జారీ చేస్తామన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్, సోషల్ వెల్ఫేర్ ఈడీ తులసిదేవి, సెట్కూరు సీఈవో వేణుగోపాల్, జడ్పీ ఏవో సి.రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గాడి తప్పిన బీఎడ్ విద్య

• తరగతులు, ప్రాక్టికల్స్ లేకున్నా పట్టాలు • ఈడబ్ల్యూఎస్ కోటాలో అడ్డగోలుగా అడ్మిషన్లు





కర్నూలు అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): డబ్బు చెల్లిస్తే చాలు తరగతులకు హాజరు కాకున్నా రికార్డులు రాయకున్నా బీఈడీ పట్టాలు ఇచ్చేస్తున్నారు. ఒరిజనల్ సర్టిఫికెట్లు లేక పోయినా పర్వాలేదంటూ అడ్మిషన్లు చేసుకుంటున్నారు. రాయలసీమ యూనివర్సిటీకి అనుబంధంగా దాదాపు 45 బీఎడ్ కళాశాలు ఉన్నాయి. వీటిలో చాలా వాటికి సొంత భవనాలు లేకున్నా వర్సిటీ అధికారులు అనుమతులు ఇచ్చారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కర్నూ లు నగరంలో-3, డోన్-2, నంది కొట్కూరు-1 బీఎడ్ కళాశాలకు కనీసం సొంత భవనాలు కూడా లేవు. వర్సిటీలోని ఓ అధికారికి సమీప బంధువైన కళాశాల యజమాని నగరంలోని సీ క్యాంప్ సమీపంలోని శకుంతల కళ్యాణ మండపం దగ్గర ఒక రూమ్‌లో నడుపుతున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు ఉప కులపతికి ఫిర్యాదు చేశారు. జిల్లాలోని కొన్ని బీఎడ్ కళాశాలలు ఈడబ్ల్యూఎస్ క్యాస్ట్ సర్టిఫికెట్ లేకున్నా ఇతర రాష్ట్రాల విద్యార్థులను చేర్చుకుంటున్నారు. నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో బీఎడ్ కళాశాల విద్యార్థులకు నిబంధనల ప్రకారం అదే జిల్లాలో పరీక్షలు జరపాలి. కానీ పరీక్షలను కర్నూలు జిల్లాలో నడపడం వివా దాస్పదంగా మారింది.

• ఉమ్మడి జిల్లాలో ఏ ఒక్క కళాశాల తరగతులు జరప కున్నా, ప్రాక్టికల్స్ నిర్వహిం చకున్నా వర్సిటీ అధికారులు యాజమాన్యాలతో లోపాయికారి ఒప్పదం కుదుర్చుకొని విద్యార్థులకు 80 శాతం బీఎడ్ పట్టాలు ఇస్తున్నారు. కళాశాల యాజమాన్యాలు ఇచ్చే ముడుపులకు కక్కుర్తి పడి బీఎడ్ విద్యార్థులు రాకున్నా బ్లాక్ బోర్డు టీచింగ్, ప్రాక్టికల్స్‌కు వచ్చినట్లు సంతకాలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏ ఒక్క కళాశాలకు ఎన్‌సీటీఈ(నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్) అనుమతులు లేకున్నా ఉర్దూ అడ్మిషన్లు చేర్చుకోవడం గమనార్హం. కళాశాల్లో వంద మంది విద్యార్థులకు 16 మంది, 50 మంది విద్యార్థులకు 8 మంది అధ్యాపకులు ఉండాలి. సీడీసీ విభాగం ప్రతి ఏటా అధ్యాపకుల జాబితాను పరిశీలించి అప్రూవు చేయాల్సి ఉంటుంది. కళాశాలల్లో మౌలిక వసతులను పరిగణలోకి తీసుకుని అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది.

బీఈడీ అడ్మిషన్లు..

బీఈడీ కాలేజీల్లో సోషియల్ -25, బయోలజీ-20, మ్యాథ్ అండ్ ఫిజిక్స్ రెండికి కలిపి -20, ఇంగ్లీష్ -10 ప్రకారం కన్వీనరు కోటాలో విద్యార్థులను చేర్చుకోవాలి. మేనేజ్ మెంట్ కోటా కింద మరో 25 శాతం విద్యార్థులను చేర్చుకోవాలి. కానీ ఈ విధానం బీఈడీ కళాశాలల్లో అమలు కావడం లేదు. స్పాట్ అడ్మిషన్ల పేరుతో ఒకే సబ్జెక్టుకు ఇతర రాష్ట్రాల విద్యార్థులను చేర్చుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. 60 శాతం ఇతర రాష్ట్రాల విద్యార్థులతో కళాశాలలు నడుపుతున్నారని ఉన్నత విద్యామండలికి కొందరు విద్యార్థులు గత సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో ప్రభుత్వం మరోసారి బయోమెట్రిక్ విధానాన్ని అమలు అంశం తెరపైకి వచ్చినట్లు తెలిసింది.

అన్నింటినీ పరిశీలిస్తాం



బీఎడ్ కళాశాలల తీరును స్వయంగా పరిశీలించి లోపాలను సరి చేస్తాను. సొంత భవనాలు లేకుండా అనుమతులు ఇవ్వడం కుదరదు. ఏవైనా అలా ఉంటే విచారించి తదుపరి చర్యలకు ఆదేశిస్తాం. **- వి. వెంకట బసవరావు, ఉపకులపతి, రాయలసీమ యూనివర్సిటీ**

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

• జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

కర్నూలు న్యూసిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో తాగునీటి ఎద్దడి రాకుండ చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జడ్పీ మినీ సమావేశ భవనంలో ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, పంచాయతీ అధికారి, ఇరిగేషన్, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న పీఆర్ రోడ్లకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. చెరువులలో నీటి సామర్థ్యంత ఎంత వరకు ఉంది..ఎన్ని చెరువులను నింపాలనే విషయాన్ని ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీపీవోను ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి హుండీ ఆదాయం రూ.39.66 లక్షలు

బేతంచెర్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్. రంగాపురం గ్రామ శివారులోని మద్దిలేటి నరసింహస్వామి, మహాలక్ష్మి అమ్మవార్ల హుండీ లెక్కింపులో రూ.39.66 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు వెల్లడించారు. 58 రోజులకు సంబంధించిన హుండీ లెక్కింపును మంగళవారం దేవదాయశాఖ అధికారి జనార్దన్, ఈవో రామాంజనేయులు సమక్షంలో లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.34,28,985 నగదు, 47 గ్రాముల బంగారు, 1.3 కిలోల వెండి వచ్చింది. అలాగే మహాలక్ష్మి అమ్మవారి హుండీ లెక్కింపులో రూ.5,27,081 నగదు కలిపి మొత్తం రూ.39,66,066 నగదు సమకూరింది. ఆలయ వేద పండితులు, అర్చకులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



హుండీ డబ్బులను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

మసీదులో చోరీ

కొత్తపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొకెరంచ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి మసీదులో గుర్తు తెలియని వ్యక్తులు తాళాన్ని పగులకొట్టి చోరీ చేశారు. రంజాన్ మాసం కావడంతో ముస్లింలు రాత్రి 10 గంటల వరకు ప్రార్థనలు చేసుకుని వెళ్లిపోయారు. మరుసటి రోజు ఉదయం మసీదులో ఇన్వర్టర్‌కు అమర్చిన రూ.13 వేలు విలువ చేసే బ్యాటరీ, గ్యాస్ సిలిండర్‌ను దొంగలించుకు వెళ్లారని తెలిపారు. మంగళవారం కొత్తపల్లి పోలీసుల ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

యువకుడిపై దాడి

నంద్యాల క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయమాల్పురం గ్రామంలో ఆల్వకొండ మధు అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన పిడతల వినోద్, పిడతల రాజారావు, పిడతల కిషోర్, పిడతల భాస్కర్ మంగళవారం కట్టెలతో దాడి చేశారు. మధు, పిడతల వినోద్ ఇద్దరు నంద్యాల పట్టణంలో ఏదో విషయంపై తిట్టుకున్నారు. ఇంటికి వచ్చిన మధు జరిగిన విషయాన్ని తన తండ్రి రాజేష్‌కు చెబుతుండగా నలుగురు వచ్చి కట్టెతో దాడి చేశారు. దీంతో మధుకు గాయాలయ్యాయి. రాజేష్ గట్టిగా కేకలు వేయడంతో బంధువులు వచ్చి మధును విడిపించారు. మధును నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. మధు తండ్రి నంద్యాల తాలుకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చైన్ స్నాచర్ అరెస్టు

నంద్యాల క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో చైన్ స్నాచర్‌ను అరెస్ట్‌చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ మంద జావలి ఆల్ఫోన్స్ తెలిపారు. మంగళవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏఎస్పీ వివరాలు వెల్లడించారు. ఎన్‌జీవో కాలనీకి చెందిన పగడాల లక్ష్మిరాజ్యం ఈ నెల 22న కూరగాయలు కొని ఇంటికి వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి కత్తితో బెదిరించి ఆమె మెడలోని సుమారు 3.4 తులాల బంగారు తాళిబొట్టు చైన్‌ను లాక్కొని పరారయ్యాడు. కేసుకు సంబంధించి టూ టౌన్ సీఐ ఇస్మాయిల్, సీసీఎస్ సీఐ సురేష్‌కుమార్, టూ టౌన్ ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, సిబ్బంది విచారణ చేసి నిందితుడు దేవనగర్‌కు చెందిన మొట్టి పెద్ద హుసేని అలియాస్ యేసు రాజును మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. విచారణ చేపట్టగా ఇటీవలే నంద్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రాంతినగర్‌లో ఒక మహిళ మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసును ఈ నెల 23న లాక్కొని వెళ్లినట్లు తేలిందన్నారు. మహిళలిద్దరి నుంచి చైన్ స్నాచింగ్‌కు పాల్పడి లాక్కెళ్లిన బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. సిబ్బందిని అభినందించారు.

నిధులు లేక నిలిచిన పనులు



పాములపాడు మండలం చెలిమిల గ్రామంలో అసంపూర్తిగా ఉన్న రైతు భరోసా కేంద్రం



కొత్తపల్లె మండలం కొక్కెరంచ గ్రామంలో నిలిచిపోయిన సచివాలయం భవనం

• అర్ధాంతరంగా ఆగిన సచివాలయాలు, ఆర్బీకేల నిర్మాణాలు
• అసంపూర్తి భవనాలపై దృష్టి సారించిన ప్రభుత్వం

నంద్యాల హాస్పిటల్, మార్చి 25 (ఆంధ్ర జ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాల పనులు నిధులు లేక నిలిచి పోయాయి. నంద్యాల జిల్లాకు కేటాయించిన 415 సచివాలయాలకుగాను రూ.180 కోట్లు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో జిల్లాలో 361 సచివాలయ భవనాల నిర్మాణాలను చేపట్టారు. అందులో 292 సచివాలయాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. 69 సచివాలయాలకు నిధులు మంజూరు చేయకపోవడంతో చివరి దశలో నిలిచిపోయాయి. మరో 54 సచివాలయాలు బేసెమెంట్‌కే పరిమితమయ్యాయి.

రైతుల భరోసా కేంద్రాల పరిస్థితీ అంతే...

జిల్లాకు 394 రైతుభరోసా కేంద్రాలు మంజూరు కాగా 281 ఆర్‌బీకే కేంద్రాలు నిర్మాణదశలో ఉన్నాయి. అందులో 222 ఆర్‌బీకేలు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చారు. 59 ఆర్‌బీకే కేంద్రాలు నిధులు లేమితో నిలిచిపోయాయి. మరో 113 ఆర్‌బీకేలు బేస్‌మెంట్‌కే పరిమితమయ్యాయి.

అసంపూర్తి భవనాలపై..

అసంపూర్తిగా ఉన్న సచివాలయాలు, ఆర్బీకేలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వెంటనే కలెక్టర్‌లతో పూర్తి స్థాయి నివేదికను ప్రభుత్వం కోరింది. ఇందులో భాగంగా జిల్లాలో అసంపూర్తిగా ఉన్న సచివాలయాల నిర్మాణానికి రూ.17 కోట్ల మేర నిధులు అవసరమని కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపారు.

రూ.126 కోట్ల బకాయిలు

వైసీపీ ప్రభుత్వంలో రోడ్ల భవనాల శాఖకు దాదాపు రూ.126 కోట్ల బిల్లులు పెండింగ్ ఉన్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో 59 పనులకు గాను ఈ బకాయిలు కాంట్రాక్టర్‌లకు చెల్లించాల్సి ఉంది. దాదాపు 70 శాతం పనులు పూర్తి చేశారు. బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. అంతేగాకుండా ఎండీఆర్ స్కీమ్ కింద రెండు పనులు మంజూరు కాగా కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టకపోవడంతో ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. రూ.5 కోట్లతో ఆళ్లగడ్డ-మాయలూరు మధ్యలో కుందూ నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలి, అలాగే రూ.2 కోట్లతో బ్రాహ్మణకొట్కూరు - మిడుతూరు మధ్యలో హైలెవల్ బ్రిడ్జి పనులు ప్రారంభించకపోవడంతో పనులను రద్దు చేశారు.

ఉల్లి సాగులో కర్నూలు టాప్

• ఉద్యాన శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు



మాట్లాడుతున్న ఉద్యాన శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా ఉల్లి పంట సాగులో ప్రత్యేక గుర్తింపు పొందడమే కాకుండా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ఉద్యాన శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు అన్నారు. మంగళవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఉల్లి సాగులో మేలైన యాజమాన్య పద్దతులపై శిక్షణా కేంద్రంలో రైతులకు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడి, నాణ్యత, నిల్వలపై అవగాహన పెంచుకుని ఆచరించాలన్నారు. ఉల్లి పంట సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు ఉల్లి రైతులకు అవసరమైన ఉల్లి నాటు యంత్రం, ఉల్లి నిల్వ గోదాములు ఏర్పాటు చేసుకుని రైతులు లబ్ది పొందాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, ఏపీడీ రాజాకృష్ణారెడ్డి, వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త రాగూర్ నాయక్, ఆర్‌డీఎఫ్ టెక్నికల్ ఆఫీసర్ శరవణన్, మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ, క్లస్టర్ వర్సిటీల ఇన్‌చార్జి వీసీగా ఉమ

కర్నూలు అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రాయలసీమ, క్లస్టర్ యూనివర్సిటీల ఇన్‌చార్జి ఉపకులపతిగా పద్మావతి యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమకు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 11 వరకు ప్రస్తుతం ఉపకులపతిగా రెండు వర్సిటీలకు కొనసాగుతున్న డాక్టర్ వెంకట బసవరావు అమెరికాలోని ఆరిజోనా స్టేట్ యూనివర్సిటీకి తన వ్యక్తిగత పర్యటనకు వెళ్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

భ్రమరాంబికాదేవికి కొబ్బరికాయల సమర్పణ



కొబ్బరికాయలు తీసుకెళ్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

శ్రీశైలం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం గానీ, శుక్రవారం గానీ భ్రమరాంబ అమ్మవారికి కుంభోత్సవం జరిపించడం సంప్రదాయం. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఏప్రిల్ 15న కుంభోత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారికి సాత్వికబలి నిర్వహించేందుకు కుంభోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభ హారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. ఈ కుంభోత్సవాన్ని పురస్కరించుకొని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే వచ్చే ప్రతి మంగళవారం గానీ, శుక్రవారం గానీ అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పిస్తారు. ఇందులో భాగంగా మంగళవారం అమ్మవారి ఆలయ ప్రదక్షిన మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో పూజాధికాలు నిర్వహించి అనంతరం అమ్మవారికి సమర్పించారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు

శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం లోక కల్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి, నందీశ్వరస్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి స్వామికి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకించి మంగళ హారతులు సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో లక్ష పుష్పార్చన

ఆత్మకూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన గోదా సమేత వేంకటేశ్వరుడి ఆలయ 25వ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళ వారం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు లక్షపుష్పార్చన క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే ఆలయంలో ఉదయం నుంచి ఆలయంలో సుప్రభాతసేవా, ఆరాధన, నివేదన, గోష్టి, చతుఃస్థానార్చన, చూర్ణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం కల్యాణం నిర్వహించనున్నారు.

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన సేవ

నంద్యాల కల్చరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నంద్యాల సంజీవనగర్ కోదండ రామాలయంలో వెలిసిన లక్ష్మీవేకంటేశ్వరునికి, కాళికాంబ చంద్రశేఖరస్వామి ఆలయంలో కాళికాంబ అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే విఘ్నేశ్వర స్వామి పంచామృత అభిషేకం, అలంకరణ, హారతి, తదుపరి మూలవిరాట్‌కు అష్టదళ పూజ చేశారు. అనంతర వెంకటేశ్వరుడికి, కాళికాంబ అమ్మవారికి 108 స్వర్ణ పుష్పములతో స్వామి, అమ్మ వారికి అష్టదళ పాద పద్మారాధన సేవ నిర్వహించారు. భగవత్ సేవా సమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, సభ్యులు దేవరశెట్టి శ్రీనివాస్, పార్థసారథికృష్ణ, కాళికాంబ చంద్రశేఖరస్వామి ఆలయ ఈవో లక్ష్మీనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి: డీఎల్‌పీవో



మాట్లాడుతున్న డీఎల్‌పీవో రాంబాబు

పాణ్యం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణలు తొలగించాలని డీఎల్‌పీవో రాంబాబు పంచాయతీ కార్యదర్శి ఆనందరావును ఆదేశించారు. పాణ్యం గ్రామంలో ఆక్రమణలు పెరిగిపోయి ప్రజల జీవన స్రవంతికి ఇబ్బందిగా మారిందని గ్రామ పంచాయతీ సభ్యులు , ప్రజా సంఘాల నాయకులు మంగళవారం వేలం పాటల్లో పాల్గొన్న డీఎల్‌పీవో దృష్టికి తెచ్చారు. ప్రశ్నించారు. గ్రామ సెంటరు రహదారి ఇరుకుగా మారిందన్నారు. డొంగు వద్ద పంచాయతీ స్థలంలో ఆక్రమణలపై అధికారులు నిర్లక్ష్యం వీడాలన్నారు. శ్మశానం అస్తవ్యస్తంగా ఉండి మృతదేహాలు పూడ్చలేని దుస్థితి ఏర్పడిందన్నారు. పంచాయతీకి వచ్చే ఆదాయాలను వసూలు చేయలేకపోగున్నారన్నారని ఆరోపించారు. ఆక్రమణలపై పోలీసు సహకారంతో ఆక్రమణలు తొలగించే ప్రక్రియ ప్రారంభించాలని డీఎల్‌పీవో ఆదేశించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బండ్లమెట్ట, మార్కెట్ వేలాల్లో రూ. 4. 67 లక్షలు, కమేలా నుంచి రూ. 8050 ఆదాయం చేకూరిందని పంచాయతీ కార్యదర్శి ఆనందరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లవి, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

31లోపు పన్ను చెల్లిస్తే 50 శాతం వడ్డీ మాఫీ

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31 లోపు ఇంటి పన్ను ఖాళా స్థలాల పన్ను చెల్లించే వారికి 50 శాతం వడ్డీ మాఫీ వర్తిస్తుందని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి తెలిపారు. ఏక మొత్తంలో వడ్డీతో సహా పన్నులు చెల్లించినవారికి 2025-26 ఆర్థిక సంవత్సరానికి కట్టిన వడ్డీలో 50% సర్దుబాటు చేయనున్నట్లు తెలిపారు. పన్ను చెల్లింపు దారుల సౌకర్యార్థం సెలవురోజుల్లో కూడా మున్సిపల్ కార్యాలయంతో పాటు సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని చెప్పారు.

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరాలు, పట్టణాల పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను చెల్లింపుదారులు మార్చి 31వ తేదీలోగా చెల్లిస్తే 50శాతం వడ్డీ మాఫీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మొదటి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జూన్, రెండో ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిసెంబరులోగా పన్ను చెల్లించాల్సి ఉందన్నారు. అంతలోపు చెల్లించని వారి నుంచి వడ్డీ వసూళ్లు చేయనున్నట్లు తెలిపారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికీ పన్నులు చెల్లించని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'సమస్యలు పరిష్కరించాలి'

ఆత్మకూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణలోని సమస్య లను పరిష్కరించాలని, అసమానతలను అరికట్టి పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని సీపీఎం నాయకులు రణధీర్ కోరారు. మంగళ వారం ఆత్మకూరు మున్సిపల్ కార్యాల యం ఎదుట ధర్నా చేపట్టి మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, కమిషనర్ రమేష్‌బాబుకు వినతిపత్రాన్ని అందజే శారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ పట్టణంలో జనాభా పెరుగుతున్నప్పటికీ అందుకు తగ్గట్లు సదు పాయాలు మెరుగుపడటం లేదని ఆరోపించారు పార్టీ నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, ఇస్మాయిల్, కిరణ్, అంబయ్య తదితరులు ఉన్నారు.

కౌన్సిల్ సమావేశం రసాభాస

- కౌన్సిలర్ అనూరాధ ప్రశ్నలు.. మద్దతుగా నిలిచిన మిగతా సభ్యులు
- సమావేశం నుంచి వెళ్లిపోయిన ఎంఈ
- మంత్రి ఫరూక్ సతీమణి మృతికి సంతాపం



కౌన్సిల్‌లో ప్రశ్నిస్తున్న సభ్యులు

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరిగింది. ఛైర్ పర్సన్ మాబున్నీసా అధ్యక్షతన మంగళవారం పట్టణంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగింది. కౌన్సిల్ ప్రారంభంలో పట్టణంలో చేపట్టనున్న వివిధ పనులు ప్రతిపాదనలను సభ్యులకు వినిపించగా సభ ఆమోదించింది.

వెళ్లిపోయిన అధికారి

తన వార్డులో సచివాలయ నిర్మాణాన్ని టీడీపీ నాయకుడు అడ్డుకుంటున్నారని 31 వార్డు కౌన్సిలర్ అనూరాధ ఆవేదన వ్యక్తం చేశారు. వార్డు కాలువలను సైతం శుభ్రం చేయటం లేదంటూ పలు సమస్యలు ప్రస్తావించారు. ఎంఈ గుర్రప్ప యాదవ్ మాట్లాడుతూ కేవలం కౌన్సిల్ లోనే సమస్యలు అడిగితే ఎలా ముందుగానే దృష్టికి తీసుకరావచ్చు కదా అని ప్రశ్నించారు. అనూరాధకు మద్దతుగా వైసీపీకి చెందిన మిగతా సభ్యులు, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్ సైతం ఎంఈ తీరును నిరసించారు. దీంతో అవమానంగా భావించిన ఎంఈ సభ నుంచి వెళ్లిపోయారు.

మాజీ చైర్ పర్సన్ దేశం సులోచన మాట్లాడుతూ తన వార్డులో మున్సిపల్ స్థలాల కబ్జాకు పలువురు విశ్వ ప్రయత్నం చేస్తున్నారని, కాపాడే ప్రయత్నం చేస్తున్నారా? అని ప్రశ్నించారు. గత కొంత కాలంగా మున్సిపల్ పరిధిలో ఎన్ని పనులను ఆన్‌లైన్ చేశారని అడిగానని, ఇంతవరకు సమాధానం లేదని కమిషనర్‌ను నిలదీశారు. 33 వార్డు కౌన్సిలర్ ఎద్దు మనోరంజని మాట్లాడుతూ తన వార్డులో జరుగుతున్న నిర్మాణాల విషయంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది పర్యవేక్షణ లోపించిందని ఆరోపించారు. నిర్మాణాలు జరిగాక పర్యవేక్షించే బదులు ముందే పర్యవేక్షిస్తే యజమానులకు ఇబ్బందులు ఉండవన్నారు. కౌన్సిలర్ సాదిక్ మాట్లాడుతూ అధికారులకు కౌన్సిలర్లు అంటే లెక్కలేదు ప్రజలచేత ఎన్నికైన ప్రజా ప్రతినిధులను అవమానించటం సరికాదనిఅన్నారు. 25వ వార్డులో మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారని స్థలాన్ని కాపాడాలని ప్రయత్నిస్తే తనతో పాటు 11 మంద పై కేసులు నమోదు చేశారని కౌన్సిలర్ కృష్ణమోహన్ ఆవేదన వ్యక్తం చేశారు.

మంత్రి ఫరూక్ సతీమణి మృతికి సంతాపం

సీనియర్ మంత్రి సతీమణి షహనాజ్ మృతికి సంతాపం వ్యక్తం చేయాల్సిన కౌన్సిల్ మరచిపోయింది. దీంతో కో ఆప్షన్ మెంబర్ పడకండ్ల కౌన్సిల్ మధ్యలో ఈ ప్రశ్న లేవనెత్తారు. నంద్యాల కౌన్సిలో సభ్యుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా 40 ఎళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితమున్న నాయకుడి సతీమణి మృతికి నివాళి అర్పించాలన్నారు. ఈ విషయంలో సహచర కౌన్సిలర్ ఖండే శ్యాంలాల్ సైతం గళమెత్తారు. దీంతో కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించి రెండు నిమిషాలు మౌనం పాటించింది. సమావేశంలో కమిషనర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే నెల మూడో శనివారం లో ముఖ్యమంత్రి చంద్రబాబు నంద్యాలకు వస్తున్నారని తెలిపారు. స్వచ్ఛంద కార్పొరేషన్ ద్వార కంపోస్టు యార్డులో ప్రస్తుతం 6 ఎకరాల్లో చెత్తను తొలగించామన్నారు. మరో 10 ఎకరాల్లో చెత్తతొలగించి కర్నూలులో జరగనున్న రీ సైక్లింగ్ యూనిట్ తరలిస్తామన్నారు. కమిషనర్ డీఈఈ నాగభూషన్ రెడ్డి, టీపీవో మూర్తి, ఏవో రమ్య, వైసీపీ, టీడీపీ మద్దతుదారులైన కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నవోదయకు ఎంపికైన కొణిదేల విద్యార్థులు

నందికొట్కూరు రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మండలంలోని కొణిదేల గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికయ్యారు. కొణిదేల గ్రామానికి ఆదిలక్ష్మి, పురుషోత్తం మూడో కుమార్తె తేజశ్విని 2025 -26 విద్యాసంవత్సరానికి గాను 6వ తరగతిలో చేరేందుకు జవహర్ నవోదయ బనవాసి విద్యాలయానికి ఎంపికైనట్లు తల్లిదం డ్రులు తెలిపారు. వీరికి ముగ్గురు కుమార్తెలు వుండా గతంలో ఇద్దరు నవోదయు ఎంపికై బనవాసి లోనే చదువునతన్నారని తెలిపారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, సుంకన్న దంపతుల కుమారుడు విద్యపోగు వరుణ్ కూడా నవోదయకు ఎంపికయ్యాడు. ఎంపికైన విద్యార్థులకు ఉపాధ్యాయులు, గ్రామస్థులు అబినందించారు.

'అర్చకుడిపై దాడి హేయం'

మహానంది, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రసిద్ధి చెందిన కొలను భారతి సరస్వతీ దేవి ఆలయ అర్చకుడిపై దాడి చేసి గాయపరచడం హేయమైన చర్య అని మహానంది క్షేత్ర అర్చక సంఘం కమిటీ సభ్యులు అన్నారు. మంగళవారం మహానందిలో ఆలయ అర్చకులు సమావేశం నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించే అర్చకుడిపై అక్కడ తాత్కాలికంగా విధులు నిర్వహించే ఉద్యోగి దాడి చేయం మంచి పద్ధతి కాదన్నారు. దాడి చేసిన అర్చకుడిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

వీహెచ్‌పీ మండల కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులను అభినందిస్తున్న చంద్రమౌళీశ్వరరెడ్డి

పాణ్యం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ పాణ్యం మండల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా వీహెచ్‌పీ అధ్యక్షుడు చంద్రమౌళీశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం పాణ్యం అంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన కమిటీ ఎన్నికలో నూతన మండల అధ్యక్షుడిగా తొగర్చేడు గ్రామానికి చెందిన జనార్దన్‌రెడ్డి, కార్యదర్శిగా కౌలూరు శ్రీనివాసులును ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా సమరత సేవా ప్రముఖ్ ఓబులరెడ్డి, జిల్లా వీహెచ్‌పీ కార్యదర్శి కిషోర్‌కుమార్, బనగానపల్లె కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ

పాణ్యం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ విద్యార్థి సందీప్‌కుమార్ అంతర్రాష్ట్ర విశ్వవిద్యాలయ క్రీడా పోటీలలో ద్వితీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 23 వరకు అన్నమయ్య జిల్లా కలికిరి జేఎన్‌టీయూఏ కళాశాలలో నిర్వహించిన అంతర్రాష్ట్ర విశ్వవిద్యాలయాల క్రీడా పోటీలలో షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించాడని చెప్పారు. విద్యార్థిని కళాశాల ఎండీ శివరాం, హెచ్‌వోడీ డాక్టర్ మల్లికార్జునరావు, పీడీ చంద్రారెడ్డి అభినందించారు.

'రీసర్వేకు రైతులు సహకరించాలి'

పాణ్యం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పాణ్యంలో జరిగే భూసమసగ్ర రీసర్వేకు రైతులు సహకరించాలని పాణ్యం తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం రీ సర్వేపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వేలో రైతులు అందుబాటులో లేని పరిస్థితిలో మరోసారి సమాచారం ఇచ్చి సర్వేకు అవకాశం ఇస్తున్నామన్నారు. ఎండలు ఎక్కువగాఉండడంతో ఉదయం 11 గంటలలోపే సర్వే పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లవి, ఎంపీటీసి రంగరమేష్, డీటీ శివశంకర్ రెడ్డి, టెలికం అడ్వయిజరీ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, బాబు, కరుణాకరరెడ్డి, వీఆర్వోలు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సూపర్‌వైజర్, ఉపాధ్యాయిని తదితరులు

మహానంది, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లకు తిమ్మాపురంలోని జడ్పీ పాఠశాలలో శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ముందుగా సూపర్‌వైజర్ కవిత జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆమె మాట్లాడుతూ మూడేళ్లలోపు పిల్లలకు పోషణ, ప్రారంభ ప్రేరణపై అవగాహన కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా పోషణ్ భీ పడాయ్ భీ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. ఈనెల 27వ తేది వరకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వెలుగోడు మండల సూపర్‌వైజర్ కోమల, జడ్పీ పాఠశాల ఉపాధ్యాయినులు పార్వతీ, మాధవి పాల్గొన్నారు.

జాయింట్ వీల్ ఏర్పాటులో రాజకీయం

- మా స్థలాల్లో ఏర్పాటు చేయాలి
- టీడీపీలోని ఇరువర్గాల ఆదేశం
- తలలు పట్టుకుంటున్న నిర్వాహకులు
- తర్తూరులో టెన్షన్ టెన్షన్.. సందర్శించిన పోలీసులు



జాయింట్ వీల్ పరికరాలతో ఉన్న లారీలను నిలిపివేసిన దృశ్యం

జూపాడుబంగ్లా, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తర్తూరు లక్ష్మీరంగనాథస్వామి జాతర ప్రారంభం కాకముందే టీడీపీలోని రెండువర్గాల మధ్య జాయింట్‌వీల్ ఏర్పాటు విషయంలో గ్రామంలో ఎప్పుడు ఏం జరుగుతోందనని గ్రామస్థుల్లో ఆందోళన నెలకొంది. జాతరకు ముందే జాయింట్‌వీల్ ఏర్పాటు చేసుకునేందుకు నాలుగు రోజుల క్రితం తర్తూరు గ్రామానికి పరికరాలతో కూడిన 6 లారీలు వచ్చి చేరాయి. అయితే తమ స్థలాల్లో ఏర్పాటు చేయాలంటూ ఇరువర్గాల వారు జాయింట్‌వీల్ యజమానులకు హుకుం జారీ చేశారు. ఒకవర్గంవారు సోమవారం సాయంత్రం వరకు ఉన్నలారీలను అక్కడినుంచి పంపించారు. మరోవర్గాన్ని జాయింట్ వీల్ యజమానులు ఆశ్రయించగా మంగళవారం మళ్లీ లారీలను గ్రామంలోకి తీసుకెళ్లాలని చెప్పడంతో ఈ సమస్య నెలకొంది. ఈ జాయింట్‌వీల్ ఏర్పాటు చేస్తే సుమారు రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉండడంతోనే ఇరువర్గాల మధ్య రాజకీయం నడుస్తున్నట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి ఎటువంటి సమస్య రాకుండా పహారా చేశారు. తర్తూరు గ్రామనికి నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం పరిశీలించి ఇరువర్గాల నాయకుల నాయకులు సమన్వయంతో మెలిగి జాతరను సజావుగా జరిగేలా చూడాలని సూచించినట్లు సమాచారం.

నేడు రంజాన్ తోఫా పంపిణీ

నంద్యాల రూరల్ మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ పరిధిలో 38 వ వార్డులో స్థానిక నాయకుడు తాటికొండ బుగ్గరాముడు బుధవారం రంజాన్ తోఫాను పంపిణీ చేయున్నారు. ఆయన పేద ముస్లిం వితంతు మహిళలకు చీరలు పంపిణీ చేస్తారు. కార్యక్రమానికి టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీఫిరోజ్ హాజరవుతారని ఆయన తెలిపారు.

కర్ణాటక భక్తులకు అన్నదానం



పాములపాడులో అన్నదానం

పాములపాడు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పాములపాడులోని శివబ్రహ్మ, మల్లికార్జున స్వామి ఆశ్రమం వద్ద గత 46 ఏళ్లుగా అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు శేషన్నగౌడు తెలిపారు. ఏటా శివరాత్రి, ఉగాది పర్వదినాలను పురస్కరించుకొని శివస్వాములకు, కర్ణాటక నుంచి పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో ఏటా వేల మంది భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. బుసగౌడు, మల్లికార్జున, మధు పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని



వెంకటాపురంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఎల్ఐసీ ఆత్మకూరు బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక్

శ్రీశైలానికి కాలినడకన పాదయాత్రగా తరలివస్తున్న కన్నడ భక్తుల కోసం మంగళవారం ఎల్ఐసీ ఆత్మకూరు బ్రాంచ్ మేనేజర్ పాండురంగనాయక్, ఏబీఎం విశ్వనాధ్ ఆధ్వర్యంలో చలివేంద్రంతో పాటు మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం వెంకటాపురం గ్రామంలోని శ్రీరాజరాజేశ్వరి మాత ఆలయ ప్రాంగణంలో పాద యాత్రికులకు ఈ మేరకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణి చేశారు. ఎల్ఐసీ ఆత్మకూరు బ్రాంచ్ ఉద్యోగులు, ఏజెంట్ల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మేనేజర్ తెలిపారు. ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నాయ కులు నాగన్న,లియాపి ట్రెజరర్ రాంబాబు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే బుడ్డా

వెలుగోడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పనూరు గ్రామంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరెడ్డి తన స్వగృహంలో సీఎంఆర్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. నియోజకవర్గంలో వివిధ అనారోగ్య కారణాలతో 58 మంది సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా రూ.50 లక్షలు మంజూరయ్యాయి. అలాగే సీఎంఏజేవై పథకం కింద మరో ముగ్గురికి రూ.3 లక్షలు మంజూరయ్యాయి. ఈ చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని అన్నారు. పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. కార్యక్రమంలో అబ్దుల్లాపురం బాషా, నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

వెలుగోడు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరెడ్డి పాల్గొననున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యేకు విన్నవించి సమస్యలను పరిష్కరించు కోవాలని సూచించారు.

స్పోర్ట్స్ మానియా-2025 ప్రారంభం

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల క్రాంతినగర్‌లోని శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల్లో నిర్వహించిన స్పోర్ట్స్ మేనియా-2025 కార్యక్రమాన్ని అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు మంగళవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సూర్యదేవర సుధాకర్, రమ్యారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్‌ల పంపిణీ

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల హౌసింగ్‌బోర్డు కాలనీలోని దివ్యాంగుల పునరావాస కేంద్రంలో జిల్లా పునర్వాస కేంద్రాల ఎండీ ఇస్మాయిల్ దివ్యాంగ విద్యార్థులకు ల్యాప్‌టా ప్‌లను అందజేశారు. వారు మాట్లాడుతూ దివ్యాంగులు వారికి కావాల్సిన పరికరాలకు పునర్వాస కేంద్రంలో సంప్రదించి నమోదు చేయించు కోవా లని తెలిపారు. స్పెషల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నాగరాజు, శ్రావణ్, మొబి లిటీ ఇన్‌స్ట్రక్టర్లు వెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి, దానంబాబు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి: డీఏవో

కొత్తపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి వైవీ మురళీకృష్ణ సూచించారు. పాలెంచెరువు గ్రామంలో సర్పంచ్ మశమ్మ అధ్యక్షతన ఏవో మహేష్ ఆధ్వర్యంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ జి.నరేంద్ర రెడ్డి, జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి, ఏడీఏ ఆంజనేయులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి చందన, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'ఉపాధి కల్పించాలి'



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కూలీలు

జూపాడుబంగ్లా, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు కల్పించకుండా అధికారులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, తమకు పనులు కల్పించాలని తాటిపాడు గ్రామ ఉపాధి కూలీలు మంగళవారం జూపాడుబంగ్లాలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఉపాధి పని కల్పించడంలో ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా చూడాలన్నారు. అనంతరం ఎంపీడీవో గోపీకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

'రైతులు సమన్వయంతో నీటిని వాడుకోవాలి'



ఈర్నపాడు వద్ద రైతులతో మాట్లాడుతున్న రామలింగారెడ్డి

బండిఆత్మకూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు, కడప కాలువ కింద రైతులు ఎలాంటి గొడవలు లేకుండా నీటిని సమన్వయంతో వాడుకోవాలని కేసీ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి సూచించారు. మంగళవారం ఆయన డీఈ రవికుమార్, ఏఈ మునాఫ్‌లతో కలిసి నంద్యాల నుంచి ఈర్నపాడు, బండిఆత్మకూరు, సంతజూటూరు పికప్ ఆనకట్టల వద్ద కెసీ కెనాల్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సంతజూటూరు పికప్ ఆనకట్ట నుంచి 600 క్యూసెక్కుల నీరు కేసీకి విడుదల జరరుగుతోందని కెనాల్‌లో అడ్డంగా కట్టలు వేయకూడదని, చివరి ఆయకట్టు వరకు రైతులకు నీరు అందేందుకు సహకరించాలని కోరారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కొత్తపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీలో ఆరో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం 2025-26లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ క్రిష్ణాబాయి మంగళవారం తెలిపారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూపులో చేరేందుకు మొదటి సంవత్సరానికి 40 సీట్లు, ద్వితీయ సంవత్సరానికి 17 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 11వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు.

ఈదురు గాలులకు విరిగిన రావి చెట్టు



రోడ్డుపై విరిగిపడ్డ రావి చెట్టు

ఆత్మకూరు రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ముష్టపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు వందల ఏళ్ళనాటి రావి చెట్టు అకస్మాత్తుగా నేల కొరిగిన సంఘటన చోటు చేసుకుంది. కాగా ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. ముష్టపల్లి గ్రామంలో రచ్చకట్ట వద్ద ఉన్న రావి చెట్టు మంగళవారం వీచిన ఈదురు గాలులకు ఒక్కసారిగా నేల కూలి అక్కడి సమీపంలోని ఓ రేకుల షెడ్డుపై పడింది.అలాగే ఆ అక్కడి రెండు విద్యుత్ స్థంభాలపై పడి ఆ విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. అకస్మాత్తుగా జరిగిన ఈ ప్రమాద సమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్థులు పేర్కొన్నారు. ఇదిలా ఉంటే గత వారం రోజుల క్రితం ఈ రావి చెట్టు అప్పట్లో వీచిన ఈదురు గాలులకు కొంత మేర వాలి ఉండటంతో అక్కడి ప్రజలు అప్రమత్తమయి అధికారులకు సమాచారం చేరవేసినా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోయారు.

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

'ఉపాధి'కి సౌకర్యాలు కరువు

ఉపాధి పనులు చేసే ప్రాంతంలో కూలీలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. అసలే ఎండకాలం. ఒక పక్క ఎండ తీవ్రతతో పలు ఇబ్బందులు పడుతుంటే వారికి కల్పించాల్సిన సౌకర్యాలు లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి పనులకు వెళ్లడానికి జంకుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నామమాత్రంగా మెడికల్ కిట్లు, టార్పాలిన్లు అందించి మమా అనిపించింది. ఐదేళ్ల పాలనలో కనీసం ఒక్క గడ్డపార కూడా ఇవ్వలేదు. గత ప్రభుత్వం కూలీల కష్టాన్ని సామాజిక రూపంలో రూ.కోట్లను ఇతర పనులకు ఉపయోగించుకొని కూలీలకు అన్యాయం చేసింది.

- జాడ లేని మెడికల్ కిట్లు, టార్పాలిన్లు
- వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం
- రెండు నెలలుగా అందని వేతనాలు
- పనులకు వెళ్లడానికి జంకుతున్న కూలీలు

చాగలమర్రి, మార్చి25 (ఆంధ్రజ్యోతి): మండలంలో 9,586 జాబ్‌కార్డులు ఉన్నాయి. 17,505 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. 2,75 లక్షల పనిదినాలకు గాను 2.41 లక్షల పనిదినాలు చేశారు. ఇంకా 33,889 పనిదినాలు చేయాల్సి ఉంది. ప్రస్తుతం మండలంలో 2,144 మంది కూలీలు వివిధ పనులు చేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రధానంగా ఎండ ఎక్కువగా ఉండటంతో టార్పాలిన్‌లు, మెడికల్ కిట్లు, గడ్డపారలు పంపిణీ చేసి కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని కూలలు కోరుతున్నారు.

సొంత డబ్బులతో గడ్డపారల కొనుగోలు

ఎండకాలంలో ఉపాధి కూలీలు పని చేసే ప్రదేశంలో నీడ కోసం టార్పాలిన్‌లు ఏర్పాటు చేయాలి. వీటికి తోడు పని చేసే సమయంలో పొరపాటున గడ్డపార తగిలితే ప్రథమ చికిత్స కోసం మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలి. గత వైసీపీ ప్రభుత్వం ఈ సౌకర్యాలు కల్పించడంలో విస్మరించింది. ఐదేళ్ల పాలనలో అరకొరగా పంపిణీ చేసి చేతులు దులుపుకుంది. నిబంధనల ప్రకారం ఒక్కోక్క శ్రమశక్తి సంఘానికి ఒక టార్పాలిన్, మెడికల్ కిట్లు ఇవ్వాల్సి ఉంది. గత ప్రభుత్వం సంఘాలను మరిచి పంచాయతీకి ఒకటి రెండు కిట్లు, టార్పాలిన్‌లు పంపిణీ చేసింది. గడ్డపారలు పంపిణీ చేయకపోవడంతో కూలీలు వారి సొంత డబ్బులు ఖర్చు పెట్టుకొని గడ్డపారలు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. నిబంధనల మేరకు 20 మంది కూలీలకు కలిసి ఒక శ్రమశక్తి సంఘాన్ని ఏర్పాటు చేసుకుంటే నాలుగు గడ్డపారలతో పాటు ఒక మెడికల్ కిట్టు, ఒక టార్పాలిన్ ఇవ్వాలి. వైసీపీ ప్రభుత్వం ఏకంగా ఆ సంఘాలనే ఎత్తివేసింది. ఉపాధి కూలీలకు రెండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కష్టపడినా ఫలితం లేకపోవడంతో కుటుంబాలను ఎలా పోషించాలని కూలీలు వాపోతున్నారు. అధికారులు స్పందించి వేతనాలను చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.



మల్లేవేములలో పంట కాలువ పనులు చేస్తున్న కూలీలు

ఉపాధి వేతనాలు చెల్లించాలి



ఉపాధి కూలీలకు రెండు నెలలుగా వేతనాలు అందలేదు. రంజాన్ పండుగకైన వేతనాలు పంపిణీ చేయాలి. వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా ఉంది. అధికారులు స్పందించి వేతనాలు చెల్లించి ఆదుకోవాలి.

- కమాల్‌బీ, మహిళా కూలీ, మల్లేవేముల

సౌకర్యాలు కల్పించాలి



ఎండలు మండుతున్నాయి. పనులకు వెళ్లాలంటే భయంగా ఉంది. నీడ కోసం టార్పాలిన్‌లు అందించాల్సి ఉంది. గడ్డపార, మెడికల్ కిట్లు కూడా పంపిణీ చేసి ఏళ్లు గడుస్తోంది. కూటమి ప్రభుత్వం స్పందించి కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి.

- ఖైరూన్‌బీ, మహిళా కూలీ, మల్లేవేముల

పని దినాలు పెంచాలి



ఉపాధి కూలీలకు అదనంగా పనిదినాలు పెంచాలి. పనికి తగ్గ కూలీ ఇవ్వాలి. తాగు నీరు, మజ్జిగ సౌకర్యం కల్పించాలి. 50 రోజులు అదనంగా పనిదినాలు కల్పించాలి. ఉగాది పండుగ నాటికైన కూలీల డబ్బులు చెల్లించాలి.

- ప్రసాద్, కూలీ, మల్లేవేముల



ఎస్సీ వసతి గృహం మరమ్మతులకు రూ.29 లక్షలు

చాగలమర్రి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవంగలి ఎస్సీ సంక్షేమ బాలుర వసతి గృహం మరమ్మతులకు రూ.20 లక్షలు మంజూరైనట్లు పంచాయతీరాజ్‌శాఖ జిల్లా ఎస్ఈ నాగరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని చిన్నవంగలి ఎస్సీ వసతి గృహం పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం హాస్టల్ మరమ్మతులకు నిధులు మంజూరు చేసిందని అన్నారు. ఈ నిధులతో గదులు, మరుగుదొడ్ల మరమ్మతు పనులు, భవనం స్లాబ్ పనులు వేగవంతం చేస్తున్నామని తెలిపారు. 75 శాతం పనులు పూర్తయ్యాయని అన్నారు. కార్యక్రమంలో పీఆర్‌డీఈ వెంకట్‌రెడ్డి, ఏఈ కొండారెడ్డి, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

న్యాయవాద సంఘం నూతన సభ్యుల ఎంపిక

కోవెలకుంట్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల న్యాయవాద సంఘం సభ్యులు నూతన సభ్యులుగా నియమించేందుకు సమావేశం నిర్వహించారు. 2025-26 సంవత్సరానికి గాను నూతనంగా కమిటీని ఎన్నుకోవడం జరిగింది. కోవెలకుంట్ల నూతన బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం.ఓబులేసు, ఉపాధ్యక్షుడుగా దారా శేఖర్, ప్రధాన కార్యదర్శిగా కె.రమేశ్, ఉప ప్రధాన కార్యదర్శిగా వి.సుధాకర్, కోశాధికారిగా ఎం.చంద్రుడులను కోవెలకుంట్ల న్యాయవాద సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. వీరు 2025 ఏప్రిల్ నుండి 2026 మార్చి వరకు కొనసాగుతారని తెలిపారు.

రైతులకు అవగాహన సదస్సు

బేతంచెర్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో ఆయిల్‌పామ్ పంట సాగుపై రైతులకు పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి అధ్యక్షతన అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కిరణ్ కుమార్, మండల ఉద్యానశాఖ అధికారి రఘువరన్ మాట్లాడుతూ నేషనల్ మిషన్ ఆఫ్ ఎడిఆబుల్ ఆల్పా స్కీం కింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఆయిల్‌ఫాం పంట సాగు చేసుకుంటే రైతులకు అందించే సబ్సిడీ వివరాలు రైతులకు వివరించారు. కార్యక్రమంలో పతాంజలి ఫుడ్ లిమిటెడ్ జిల్లా అధ్యక్షులు దేవయ్య, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించినందుకు ఎస్టీయూ హర్షం

చాగలమర్రి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం చెల్లించినందుకు ఎస్టీయూ నాయకులు మంగళవారం ప్రకటించారు. ఎస్టీయూ అదనపు ప్రధాన కార్యదర్శి శివ శంకర్ మాట్లాడుతూ ఏపీజీఎల్ఐ, పీఎఫ్ నగదును వ్యక్తిగత ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందని అన్నారు. అరియర్స్ చెల్లించినట్లైతే ఉపాధ్యాయుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని అన్నారు. కార్యక్రమంలో మండల ఎస్టీయూ సంఘం అధ్యక్షుడు మస్తాన్‌బాషా, కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి మాబుహుసేన్, జిల్లా ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాష, ఎస్టీయూ సంఘ నాయకులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల : ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్న జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, సీపీఎఫ్, ఉద్యోగుల కాంట్రిబ్యూషన్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడం పట్ల రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ హర్షం వ్యక్తం చేస్తున్నట్లు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్ఎం షరీఫ్, అధికార ప్రతినిధి వీరబ్రహ్మం మంగళవారం తెలిపారు.

రూ.50 లక్షలతో ప్రతిపాదనలు

చాగలమర్రి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసీ ప్రధాన కాలువ లైనింగ్ మరమ్మతులకు రూ.50 లక్షలతో ప్రతిపాదనలు చేసినట్లు కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. మంగళవారం రాజోలి ఆనకట్ట వద్ద కుందూ నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. కుందూ నుంచి కడప జిల్లా వైపు 200 క్యూసెక్కుల నీటిని కేసీ ప్రధాన కాలువకు 200 క్యూసెక్కులు, చాపాడు చానల్‌కు 50 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని అన్నారు. ఈనెల చివరి వరకు సాగునీరు అందిస్తామని అన్నారు.

కమనీయం.. వెంకటేశ్వర స్వామి కల్యాణం

చాగలమర్రి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండంలోని మూడురాళ్లపల్లె



మూడరాళ్లపల్లెలో వెంకటేశ్వరస్వామి కల్యాణం చేస్తున్న వేద పండితులు

గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులచే కల్యాణోత్సవం వైభవంగా జరిగింది.. వేద పండితులు చిన్నశాస్త్రీ, శివశంకర్‌శాస్త్రీ ఆధ్వర్యంలో ఉభయదారులు బొప్పాయి శ్రీనివాసులు, విజయలక్ష్మి, మురళీ, చైతన్యలక్ష్మి, సత్యేంద్ర, లక్ష్మీ దంపతులచే కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులచే పల్లకి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.7.53 లక్షల ఆదాయం

శిరివెళ్ల, మార్చి 25(ఆంధ్రజ్యోతి) : శిరివెళ్ల గ్రామ పంచాయతీకి సంత మార్కెట్ బహిరంగ వేలంపాటల ద్వారా రూ.7.53 లక్షల ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి అశ్విన్ కుమార్ తెలిపారు. డీఎల్పీవో రాంబాబు పర్యవేక్షణలో సచివాలయం-1లో అధికారులు మంగళవారం వేలంపాటలు నిర్వహించారు. దినసరి మార్కెట్‌కు గత ఏడాది రూ.7 లక్షలు రాగా ఈ ఏడాది రూ.6.2 లక్షలు వచ్చిందన్నారు. కబేళాకు గత ఏడాది రూ.50 వేలు రాగా ప్రస్తుతం రూ.1.33 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. వారపుసంత మార్కెట్‌కు సరైన స్పందన లేకపోవడంతో వేలంపాటను అధికారులు వాయిదా వేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాస శర్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో సాయిచైతన్య విద్యార్థుల ప్రతిభ

కొలిమిగుండ్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన నవోదయ ఫలితాల్లో కొలిమిగుండ్లకు చెందిన సాయి చైతన్య విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. పాఠశాల నుంచి 5మంది విద్యార్థులు నవోదయ పాఠశాలలకు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో విద్యనభ్యసించే మోక్షిత్, అరవింద, సందేశ్, గీతాంజలి, అపూర్వ విద్యార్థులు నవోదయకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం రాము, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, శంకర్ వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులు నవోదయ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశిస్తారని తెలిపారు.



బాల్యవివాహాల నిర్మూలనకు కృషి

బనగానపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సమిష్టి కృషితోనే బాల్యవివాహాల నిర్మూలన సాధ్యమని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. మంగళవారం మండలంలోని పలుకూరు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం మల్లికార్జున రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల ఆరోగ్యాలు, ఎలా పాడవుతాయో, ఆరోగ్యాలు ఎలా దెబ్బతింటాయో వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుకిశోర్, సురేష్, వెంకటేశ్వర్లు, పుల్లయ్య పాల్గొన్నారు.

ప్రజలకు మేలు జరగాలి: ఎమ్మెల్యే

డోన్ రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మేలు జరగాలని, ప్రజల సంక్షేమం తమ ప్రధాన లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యంగా నేషనల్ హైవే రహదారి విస్తరణ పనులు, ప్రధాన కాలువల మరమ్మతులు, భూసేకరణ సమస్యలు, అటవీ భూముల పరిరక్షణ, నీటి నిల్వల సామర్థ్యం, తాగునీటి ప్రాజెక్టులు తదితర వాటిపై అధికారులతో ఆయన సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలగకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అధికారులు అలసత్వం వహించకుండా వారి వారి శాఖల పరిధిలో ఉన్న పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో నరసింహులు, ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీరాజ్, రెవెన్యూ, అటవి, విద్యుత్ తదితర శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

ఘనంగా కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాలు

డోన్ రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడుములపాడు గ్రామ సమీపంలో కొలువుదీరిన కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. కాశిరెడ్డి నాయన ఆలయ ప్రాంగణంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు భక్తబృందం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామివారికి జరిగిన విశేష పూజలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆరాధన ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద బండలాగుడు పోటీలు నిర్వహించారు.

మాజీ ధర్మకర్త కుటుంబ సభ్యులకు పరామర్శ

బేతంచెర్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఎంబాయి గ్రామానికి చెందిన మద్దిలేటి స్వామి మాజీ ధర్మకర్త, సొసైటీ మాజీ డైరెక్టర్ బెలం కృష్ణారెడ్డి గుండెపోటుతో గత మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, ఏ సమస్య ఉన్నా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారామచంద్రుడు, జిల్లా అధికారి ప్రతినిధి పుసులూరు మురళికృష్ణ, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు యుగంధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, మండల కన్వీనర్ కుంచా తిరుమలేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బుక్ కీపర్లను కొనసాగించాలి

బనగానపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : బనగానపల్లె పట్టణంలో బుక్ కీపర్లను కొనసాగించాలని, తొలగించిన బుక్ కీపర్లను కొనసాగించాలని కోరుతూ బనగానపల్లె ఏపీఎం కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మంగళవారం ఏపీఎం కార్యాలయం వద్ద పలువురు పొదుపు మహిళలు, బుక్ కీపర్లు ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకుడు సుబ్బయ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

28న బాక్సు టెండరు వేలాలు

డోన్ టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో 28న బాక్సు టెండరు వేలాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కూరగాయల మార్కెట్, వారపు సంత మార్కెట్, బస్టాండు, మాంసపు మార్కెట్, జంతు వధశాలలకు వేలాలు నిర్వహించగా.. వేలాలకు పాటాదారులు ఎవరూ పాల్గొనలేదన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు బాక్సు టెండరు వేలాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

డోన్ టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సకాలంలో ఇంటి పన్నులు, ఖాళీ స్థలాలపై పన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు మంగళవారం తెలిపారు.ఆయన మాట్లాడుతూ సకాలంలో పన్నులు చెల్లించకపోతే 2 శాతం వడ్డీతో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నుల బకాయిలను ఈ నెల 31వ తేదీలోపు ఒకేసారి మొత్తం చెల్లించినట్లయితే చెల్లింపుదారులకు వడ్డీ 50 శాతం రాయితీని కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు.

వైభవంగా పూర్ణాహుతి



చాగలమర్రిలో పూర్ణాహుతి చేస్తున్న వేద పండితులు, మహిళలు

చాగలమర్రి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని శివరామానంద ఆశ్రమంలో శంకరానందస్వామి 55వ ఆరాధన మహోత్సవాల సందర్భంగా మంగళవారం ఆశ్రమ పీఠాధిపతి అభినవ శంకరానందస్వామి, యోగేశ్వరానందగిరి ఆధ్వర్యంలో పూర్ణాహుతి హోమం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని హోమాలు చేశారు. గీతాపారాయణం, కళశ స్థాపన, ఆరాదన కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ఆశ్రమ నిర్వాహకులచే ఆధ్యాత్మిక ఉపన్యాసాలు చేశారు.

భూ రీసర్వే పనులకు రైతులు సహకరించాలి

దొర్నిపాడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో త్వరలో ప్రారంభం కానున్న భూరీసర్వే పనులకు రైతులు సహకరించాలని తహసీల్దార్ సుభద్ర తెలిపారు. మంగళవారం దొర్నిపాడు ఎరుకలి స్వామి ఆలయ ఆవరణలో భూరీసర్వేపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దొర్నిపాడు గ్రామంలో రైతుల సమక్షంలోనే భూరీసర్వే నిర్వహించడం జరుగుతుందని, సర్వే నంబర్‌లు, విస్తీర్ణంలో వ్యత్యాసాలుంటే రైతులు తగిన పత్రాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవ, జెడ్పీటీసీ శకుంతల, వీఆర్వోలు నాగేష్, సావిత్రి, గ్రామ సర్వేయర్ నాగార్జునరెడ్డి, మాజీ సర్పంచ్ సిద్ధినారాయణ, మనోహర్‌రెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ సుభద్ర

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె గ్రామంలో మంగళవారం భూ రీసర్వే ర్యాలీ డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖరయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ చేసి రైతులకు అవగాహన కల్పించారు. వచ్చే వారం నుంచి సర్వే ప్రారంభిస్తామన్నారు. రైతులు సహకరించి తమ పొలాల వద్ద ఉండి రీసర్వే చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో నీలకంఠేశ్వర్, సర్వేయరు రమణ, సర్పంచ్ జయవర్ధన్‌రెడ్డి, ఉప సర్పంచ్ మందారపు బాలరాజు, కార్యదర్శి అరవిందనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

కొలిమిగుండ్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన జయమ్మకు సీఎం సహాయ నిధి నుంచి రూ.30,700 మంజూరైనట్లు ఇటిక్యాల టీడీపీ యువ నాయకులు తోట పరమేశ్వరరెడ్డి, విశ్వనాథరెడ్డి మంగళవారం వెల్లడించారు. పెట్నికోట గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను కొలిమిగుండ్ల మండల తెలుగు యువత అధ్యక్షుడు గొంగటి హుస్సేన్‌రెడ్డి పంపిణీ చేశారు.

ప్యాపిలి: ఏనుగమర్రి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ నాయకులు ఆంజినేయులు కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి రూ.4.18లక్షల చెక్కును అందజేశారు. మంగళవారం డోన్‌లోని తన నివాసంలో ఆయన చెక్కును మృతుడి భార్య వేదవతికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మోపూరి రామక్రిష్ణ, అరిగెల శంకర్, రాము, సూర్యనారాయణగౌడు పాల్గొన్నారు.

దొర్నిపాడు: దొర్నిపాడు గ్రామానికి చెందిన జేసిక అనే మహిళకు సీఎం సహాయనిధి కింద రూ.2లక్షలు చెక్కును ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చేతుల మీదుగా బాధితురాలి తండ్రి సుధాకర్‌కు అందించడం జరిగిందని మండల టీడీపీ నాయకుడు సిద్ధి సత్యం తెలిపారు.

డోన్ రూరల్: కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఇది ప్రజా ప్రభుత్వమని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద వచ్చిన రూ.4,18,681 చెక్కులను బాధిత కుటుంబాలకు ఆయన అందజేశారు.

'చిన్న పిల్లలను పనుల్లోకి చేర్చుకోవద్దు'

కొలిమిగుండ్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : 18సంవత్సరాల లోపు బాలబాలికలను పనుల్లోకి తీసుకుంటే చర్యలు తప్పవని బనగానపల్లె అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శోభారాణి హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్సీపీ సీఆర్ చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. పలు దుకాణాలు, చిన్న పరిశ్రమలు ఇతర వ్యాపార సముదాయాలను తనిఖీలు చేసి, నిర్వాహకులకు బాల కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కొలిమిగుండ్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్వటాల సమీపంలో రామ్‌కో సిమెంట్ పరిశ్రమ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం జిల్లా యాడికి గ్రామానికి చెందిన ఓబులేషు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఓబులేసు మోటార్‌సైకిల్‌పై మంగళవారం కల్వటాలకు వెళుతుండగా, రామ్‌కో నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఓబులేసును 108 వాహనంలో తాడిపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు బంధువులు వెల్లడించారు.

ఉగాది ఉత్సవాలకు ఆర్థిక సాయం

కొలిమిగుండ్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటపాడు గ్రామంలో జరిగే ఉగాది ఉత్సవాలకు రామ్‌కో సిమెంట్ పరిశ్రమ రూ.60వేలు ఆర్థిక సహాయం అందించినట్లు రామ్‌కో అడ్మిన్ ప్రెసిడెంట్ రామరాజు తెలిపారు. ఈ మొత్తాన్ని మంగళవారం కోటపాడు గ్రామపెద్దలు మూల సీతారామిరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, భాస్కరనాయుడు, కిట్టయ్య, చలమయ్య తదితరులకు అందజేశారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు వేడుకలు నిర్వహించుకోవడానికి ఈ మొత్తాన్ని అందించామని తెలిపారు. రామ్‌కో భరత్‌రెడ్డి పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న రామ్‌కో అడ్మిన్ ప్రెసిడెంట్ రామరాజు

పేదలకు న్యాయ సేవలందించాలి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 25(ఆంధ్రజ్యోతి) : పేద ప్రజలకు న్యాయ సేవలందించేందుకు బాధ్యతగా పని చేయాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ న్యాయవాదులకు సూచించారు. ఆళ్లగడ్డ సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా(ఏజీపీ) నియమితులైన కమతం బాలగురెడ్డి.. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, భార్గవ్‌రామ్ దంపతులను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసారు. వారిని శాలువా, పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఏజీపీ బాల గురెడ్డిని ఎమ్మెల్యే దంపతులు అభినందించారు.



ఆళ్లగడ్డలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న న్యాయవాదులు

ఈ కార్యక్రమంలో ఏపీపీ శివ ప్రసాదరావు, సీనియర్ న్యాయవాదులు శివరామిరెడ్డి, రమణయ్య, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ :

ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని తొమ్మిది మంది బాధితులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.7.54 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మంగళవారం పంపిణీ చేశారు. సీఎం నారా చంద్రబాబు నాయుడుకు, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు బాధితుల కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

'ఉపాధి' పనులపై శిక్షణ

బేతంచెర్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు ఉన్న కూలీలకు వందరోజుల పని తప్పనిసరిగా కల్పించాలని ఉపాధి మేట్‌లకు ఎంపీడీవో ఫజుల్ రెహిమాన్ సూచించారు. మంగళవారం పట్టణంలోని బేతంచెర్ల మండల పరిషత్ భవనం ఎంపీడీవో ఫజుల్ రెహిమాన్ అధ్యక్షతన గ్రామీణ ఉపాధి హామీ పథకం సంబంధించి అన్ని గ్రామ పంచాయతీలలోని మేటీలకు విధులు, బాధ్యతల గురించి కోర్సు డైరెక్టర్ ఏసుదాను శిక్షణ ఇచ్చారు. ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించగలరని తెలిపారు. సమావేశంలో ఏపీవో శేషన్న, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు బిల్లుపై ముస్లింలకు న్యాయం చేయాలి

బేతంచెర్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ముస్లీం మైనార్టీ సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో మేలు చేశారని నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గ మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు సయ్యద్ ఇద్రుస్ బాషా అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ త్వరలోనే రంజాన్ పండుగ అనంతరం నియోజకవర్గంలోని మండలంలో ఎంహెచ్‌పీఎస్ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. వక్ఫ్ బిల్లును జేపీసీకి సిఫారసు చేసిందే ఏపీ సీఎం అని, ముస్లీం మైనార్టీల సభ్యులందరూ వక్ఫ్ బోర్డు సమస్యలపై సమష్టిగా కలిసి పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంహెచ్‌పీఎస్ ప్యాపిలి మండల అధ్యక్షులు సయ్యద్ అక్బర్‌బాషా, ఉపాధ్యక్షులు ముస్తాక్, అల్లాబకాష్ పాల్గొన్నారు.

మహిళలు జీవనోపాధులు పెంచుకోవాలి

బనగానపల్లె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలు రుణాలు సద్వినియోగం చేసుకొని జీవనోపాధులను పెంచేలా వెలుగు సిబ్బంది పనిచేయాలని చేసుకోవాలని డీఆర్‌డీఏ జిల్లా పీడీ శ్రీధర్‌రెడ్డి కోరారు. మంగళవారం బనగానపల్లె ఎంపీడీవో కార్యాలయంలోని పొదుపు భవనంలో డోన్, బనగానపల్లె క్లస్టర్ పరిధిలోని 10 మండలాల మండల సమాఖ్య సభ్యులు వెలుగు సీసీలు, ఏపీవోలకు శిక్షణా తరగతులు పీడీ ఆధ్వర్యంలో నిర్వహించారు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాలకు చెందిన వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. వారికి రుణాల చెల్లింపులు, వసూళ్లు, తీసుకున్న రుణాలను పొదుపు సంఘాలు సద్వినియోగం ఎలా చేసుకోవాలో పీడీ వివరించారు.



అవగాహన కల్పిస్తున్న శ్రీధర్‌రెడ్డి